

# ప్రజాస్ఫూర్తి
PRAJASPOORTHI TELUGU DAILY
తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | గురువారం 14-08-2025 | సంపుటి - 24 | సంచిక - 99 | రూ : 4 | పేజీలు: 8


## జోరువాన.. యమ యాతన




- హైదరాబాద్ సహా పలు జిల్లాల్లో భారీ వర్షా లు
- ఉమ్మడి ఆదిలాబాద్‌లో కుండపోత
- మంచిర్యాల జిల్లా కన్నెపల్లిలో అత్యధికంగా 23.3 సెం.మీ.
- పొంగి పొర్లుతున్న వాగులు, వంకలు
- రాష్ట్రంలో మరో నాలుగు రోజులు భారీ వర్షా లే
- నేడు మూడు జిల్లాల్లో పాఠశాలలకు సెలవు

ఉమ్మడి వరంగల్: రాష్ట్రవ్యాప్తంగా బుధవారం ఎడతెరిపి లేకుండా కుండపోత వర్షం కురిసింది. రాజధాని హైదరాబాద్‌తో పాటు పలు జిల్లాల్లో భారీ వర్షపాతం నమోదైంది. చెరువులు, వాగులు, వంకలు పొంగిపొర్లడంతో రాకపోకలు స్తంభించిపోయాయి. పల్లె, పట్టణం తేడా లేకుండా చాలాచోట్ల రోడ్లు, కాలనీలపైకి వరదనీరు చేరడంతో జనజీవనం అతలాకుతలమైంది. ప్రధానంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు జోరువాన కురిసింది. కన్నెపల్లి (మంచిర్యాల జిల్లా) లో అత్యధికంగా 23.3 సెం.మీ. వర్షపాతం నమోదైంది. భీమిని (మంచిర్యాల) లో 22.6, రెబ్బెన (కుమురం భీం)లో 22 సెం.మీ. వర్షం పడింది. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో వచ్చే నాలుగు రోజుల తరువాయి 2లో

## ఏఐ సృజనాత్మక కేంద్రం

- ఒకే గొడుగు కిందకు కృత్రిమ మేధ కార్యక్రమాలు
- మూడేళ్లలో 50 వేల మందికి పైగా నైపుణ్య శిక్షణ
- 10 వేలకుపైగా ఉద్యోగావకాశాలు
- ఏఐ యూనివర్సిటీ కూడా ఏర్పాటు
- తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటుకు సర్కారు ప్రణాళిక
- సీఎం ఆదేశాలతో వేగంగా కార్యాచరణ



2లో



రాఖీ పండుగ.. ఆర్టీసీలో రికార్డు స్థాయిలో

## మహిళల ప్రయాణాలు

- ఆరు రోజుల్లో 3.68 కోట్ల రాకపోకలు
- 2.51 కోట్ల ఉచిత ప్రయాణాలు ఉన్నట్లు ఆర్టీసీ వెల్లడి
- 7 నుంచి 12వ తేదీ వరకు ప్రయాణాలు

2లో



2లో

జగన్... నేను దేని గురించి మాట్లాడుతున్నానో

## మీకు బాగా తెలుసు!

- జగన్ 'ఓట్ల చోరీ' ఆరోపణలను తిప్పికొట్టిన మంత్రి లోకేశ్
- 'నోట్ల చోరీ' వల్లే వైసీపీ ఓటమి పాలైందని ఘాటు విమర్శ
- తమకు ప్రజలతోనే అసలైన 'హాట్‌లైన్' ఉందని స్పష్టీకరణ
- మోదీ, చంద్రబాబు నాయకత్వంలో ఏపీకి తిరిగి అగ్రస్థానం
- డబుల్ ఇంజిన్ సర్కార్‌తో రాష్ట్ర ప్రగతి ఖాయమని ధీమా


## 2030 కామన్వెల్త్ గేమ్స్..

ఆతిథ్యం కోసం భారత్ అధికారిక బిడ్.. ఐఓఏ గ్రీన్ సిగ్నల్

- 2030 కామన్వెల్త్ గేమ్స్ ఆతిథ్యం కోసం భారత్ అధికారిక ప్రయత్నాలు
- కెనడా తప్పుకోవడంతో పెరిగిన అవకాశాలు
- వేదికగా గుజరాత్‌లోని అహ్మదాబాద్ నగరం ప్రతిపాదన



2లో



కేబీసీలో 'ఆపరేషన్ సిందూర్'

## అధికారులు .. దుమారం

- స్వాతంత్ర్య దినోత్సవ ప్రత్యేక ఎపిసోడ్‌పై చెలరేగిన వివాదం
- సైన్యాన్ని పీఆర్ కోసం వాడుకుంటున్నారని సోషల్ మీడియాలో విమర్శలు
- యూనిఫాంలో రియాలిటీ షోకు హాజరుకావడంపై నెటిజన్ల ఆగ్రహం
- ఆర్మీ ప్రోటోకాల్ నిబంధనలను ఉల్లంఘించారంటూ ఆరోపణలు

2లో

## 79వ స్వాతంత్ర్య దినోత్సవం

రేపు జాతినుద్దేశించి రాష్ట్రపతి ప్రసంగం...

2లో



- 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రేపు జాతినుద్దేశించి రాష్ట్రపతి ప్రసంగం
- ఎల్లుండి ఎర్రకోట నుంచి ప్రసంగించనున్న ప్రధాని నరేంద్ర మోదీ
- దేశ రాజధాని ఢిల్లీలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు
- పలు కీలక ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధింపు
- ఉదయం 4 గంటల నుంచే మెట్రో ప్రత్యేక సర్వీసులు
- సాయుధ బలగాల బ్యాండ్ ప్రదర్శనలతో దేశభక్తి వాతావరణం

ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారం

## వేసే ప్రసక్తే లేదు: సీఎం

ఏపీని 'గ్రీన్ ఎనర్జీ కారిడార్'గా తీర్చిదిద్దుతామన్న చంద్రబాబు

- వినియోగదారులపై విద్యుత్ ఛార్జీల భారం వేయొద్దని అధికారులకు ఆదేశం
- ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలపై దృష్టి సారించాలని కీలక సూచన
- పంపిణీ నష్టాలు, బహిరంగ మార్కెట్ కొనుగోళ్లు తగ్గించాలని స్పష్టం
- వ్యవసాయానికి స్మార్ట్ మీటర్లు వద్దని తేల్చిచెప్పిన ముఖ్యమంత్రి



5లో

## రాఖీ పండుగ.. ఆర్టీసీలో రికార్డు స్థాయిలో మహిళల ప్రయాణాలు

**హైదరాబాద్ :** రాఖీ పండుగ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో మహిళలు రికార్డు స్థాయిలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణాలు సాగించారు. ఆగస్టు 7 నుంచి 12వ తేదీ వరకు ఈ ఆరు రోజుల్లో మొత్తం 3.68 కోట్ల మంది రాకపోకలు సాగించగా, అందులో 2.51 కోట్ల ఉచిత ప్రయాణాలు ఉన్నట్లు ఆర్టీసీ సంస్థ తెలిపింది. ఈ మేరకు సంస్థ ఎండీ సజ్జనార్ 'ఎక్స్' వేదికగా ఒక ప్రకటన విడుదల చేశారు. అన్నాచెల్లెళ్ల, అక్కాతమ్ముళ్ల అనుబంధానికి ప్రతీక అయిన రాఖీ పండుగ రోజున 45.62 లక్షల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారని సజ్జనార్ తన ప్రకటనలో పేర్కొన్నారు. ఆగస్టు 11న అత్యధికంగా 45.94 లక్షల మంది రాకపోకలు సాగించారని, ఒక్కరోజులో ఇంతమంది మహిళలు ప్రయాణించడం ఇదే తొలిసారి అని వెల్లడించారు. గత ఏడాది రాఖీ పండుగకు 2.75 కోట్ల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేశామని, అప్పటితో పోలిస్తే ఈ సంవత్సరం 92.95 లక్షల మంది ఎక్కువగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారని ఆయన తెలిపారు. ఈ ఏడాది బస్సులు 2.28 కోట్ల కిలోమీటర్ల మేర తిరిగాయని, గత ఏడాదితో పోలిస్తే 53 లక్షల కిలోమీటర్లు అదనంగా తిరిగాయని ఆయన వెల్లడించారు.

## 2030 కామన్వెల్త్ గేమ్స్..
# ఆతిథ్యం కోసం భారత్ అధికారిక బిడ్..

**ఢిల్లీ :** 2030 కామన్వెల్త్ క్రీడల ఆతిథ్యం దిశగా భారత్ ఒక కీలక ముందడుగు వేసింది. ఈ మెగా క్రీడల నిర్వహణకు భారత్ దాఖలు చేయనున్న బిడ్‌కు భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అధికారికంగా ఆమోదముద్ర వేసింది. బుధవారం జరిగిన ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో (ఎస్‌జీఎం) ఈ మేరకు ఏకగ్రీవ నిర్ణయం తీసుకున్నారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్ నగరాన్ని ప్రధాన వేదికగా ప్రతిపాదిస్తూ ఈ బిడ్‌ను సిద్ధం చేస్తున్నారు. ఈ పోటీ నుంచి కెనడా వైదొలగడంతో 2030 కామన్వెల్త్ క్రీడల ఆతిథ్య హక్కులను పొందేందుకు భారత్‌కు అవకాశాలు గణనీయంగా మెరుగుపడ్డాయి. ఇప్పటికే ప్రాథమిక ఆసక్తిని వ్యక్తం చేసిన భారత్, తుది బిడ్ పత్రాలను ఆగస్టు 31 లోపు సమర్పించాల్సి ఉంది. ఈ క్రీడల నిర్వహణకు అయ్యే పూర్తి ఖర్చును కేంద్ర ప్రభుత్వమే భరిస్తుందని ఐఓఏ స్పష్టం చేసింది. ఈ సమావేశం అనంతరం ఐఓఏ జాయింట్ సెక్రటరీ కల్యాణ్ చౌబే మాట్లాడుతూ, "జనరల్ హౌస్ ఈ ప్రతిపాదనను ఏకగ్రీవంగా ఆమోదించింది. ఇకపై మా సన్నాహాలను వేగవంతం చేస్తాం" అని తెలిపారు. ఇటీవల కామన్వెల్త్ స్పోర్ట్ గేమ్స్ డైరెక్టర్ డారెన్ హాల్ నేతృత్వంలోని బృందం అహ్మదాబాద్‌లోని క్రీడా వేదికలను పరిశీలించి, గుజరాత్ ప్రభుత్వ అధికారులతో సమావేశమైంది. ఈ నెలలోనే మరో పెద్ద ప్రతినిధి బృందం పర్యటించనుంది. 2026 గ్లాస్గో క్రీడల మాదిరిగా కాకుండా, 2030లో పూర్తిస్థాయిలో అన్ని క్రీడాంశాలతో గేమ్స్ నిర్వహిస్తామని ఐఓఏ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడు రోహిత్ రాజ్‌పాల్ అన్నారు. "భారత్‌కు ఎక్కువ పతకాలు తెచ్చిపెట్టే షూటింగ్, ఆర్చరీ, రెజ్లింగ్ వంటి క్రీడలతో పాటు మన దేశీయ క్రీడలైన కబడ్డీ, ఖో ఖోలను కూడా చేర్చాలని యోచిస్తున్నాం" అని ఆయన వివరించారు. కామన్వెల్త్ స్పోర్ట్ జనరల్ అసెంబ్లీ నవంబర్ చివరి వారంలో గ్లాస్గోలో సమావేశమై ఆతిథ్య దేశంపై తుది నిర్ణయం తీసుకోనుంది. భారత్ గతంలో 2010లో ఢిల్లీ వేదికగా కామన్వెల్త్ క్రీడలను విజయవంతంగా నిర్వహించిన విషయం తెలిసిందే.

# జోరువాన.. యమ యాతన

(మొదటిపేజీ తరువాయి)

పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని.. ఉరుములు మెరుపులు, గంటకు 40 నుంచి 50 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. జీహెచ్‌ఎంసీ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం 7 నుంచి 12 సెం.మీ. వర్షం కురిసే అవకాశం ఉందని ప్రకటించారు. ఉత్తర తెలంగాణలో 17వ తేదీన వర్షపాతం అధికంగా ఉండే అవకాశం ఉందని వెల్లడించారు. మెదక్, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరించడంతో ఆ జిల్లాల్లో గురువారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలన్నిటికీ సెలవు ప్రకటిస్తూ పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు డాక్టర్ నవీన్ నికోలస్ ఉత్తర్వులు జారీ చేశారు.

**ఉదయం నుంచే ధాటిగా...**

బుధవారం ఉదయం నుంచే వర్షాలు ధాటిగా ప్రారంభమయ్యాయి. తాండూరు (మంచిర్యాల) 18.2, చిట్యాల (భూపాలపల్లి)లో 18 సెం.మీ., మంగపేట (ములుగు) 16.4, నెన్నెల (మంచిర్యాల) 14.6, గిన్నెదరి (కుమురంభీం) 14.3, జంబుగ 13.8, జంకాపూర్ (మంచిర్యాల)లో 13.7, రేగొండ (భూపాలపల్లి)లో 13.3, కుంచవల్లి (కుమురంభీం)లో 12.7 సెం.మీ వర్షపాతం నమోదైంది. సిద్దిపేట జిల్లా పెద్దాపూర్, కరీంనగర్ జిల్లా పోచంపల్లి, ములుగు జిల్లా వెంకటాపురం, చెల్పూరు, మంగపేట, సూర్యాపేట జిల్లా అలంగపురం, పెద్దపల్లి జిల్లా శ్రీరాంపూర్, కరీంనగర్ జిల్లా చిగురుమామిడిలలో భారీ వర్షపాతం నమోదైంది.

**రాజధానిలోనూ..**

రాజధాని హైదరాబాద్‌లో బుధవారం భారీ వర్షం కురిసింది. దక్షిణ నగరంలోని మామిడిపల్లి, శంషాబాద్, రాజేంద్రనగర్, చార్మినార్ ప్రాంతాల్లో వరుణుడు బీభత్సం సృష్టించాడు. బాలాపూర్ మండలంలోని మామిడిపల్లిలో రాత్రి 9 గంటల వరకు 9.35 సెం.మీ. గరిష్ఠ వర్షపాతం నమోదవగా, శంషాబాద్‌లో 8.7 సెం.మీ. వర్షం కురిసింది. హైటెక్‌సిటీ నుంచి ఖైరతాబాద్ వరకు ఓ మోస్తరు వాన కురవగా, ఉత్తర భాగంలోని శామీర్‌పేట, అల్వాల్, కొంపల్లి చుట్టుపక్కల ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు పడ్డాయి. గగన్‌పహాడ్‌లో విమానాశ్రయం వైపు వెళ్లే బెంగళూరు హైవేపై మోకాల్లోతు నీరు ప్రవహించింది. నాలుగేళ్ల కిందట జల్‌పల్లిలో ఎదురైన తీవ్రమైన ముంపు సమస్య పునరావృతమైంది. పదుల కొద్దీ కాలనీలు నీట మునిగాయి. పాతబస్తీలోని యాకుత్‌పురలో మహ్మద్ గౌస్ అనే యువకుడు ప్రమాదవశాత్తు జారి నాలాలో పడగా.. హైడ్రా సిబ్బంది నిచ్చెన సాయంతో రక్షించారు. వర్ష హెచ్చరికలు, ఉద్యోగులకు వర్క్ ఫ్రం హోం ప్రకటనలతో రహదారులపై వాహనాల రాకపోకలు ఓ మోస్తరుగానే కనిపించాయి.

## ఏఐ సృజనాత్మక కేంద్రం

హైదరాబాద్: అంతర్జాతీయంగా కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ఏఐ) రాజధానిగా తెలంగాణను తీర్చిదిద్దే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. ఏఐ ఆవిష్కరణలు, పరిశోధన, అభివృద్ధి, వాణిజ్యంలో రాష్ట్రాన్ని ప్రపంచ దేశాల్లో అగ్రగామిగా నిలబెట్టాలనే లక్ష్యంతో 'తెలంగాణ ఏఐ సృజనాత్మక కేంద్రం' (తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్‌టీఏఐహెచ్) స్థాపించాలని నిర్ణయించింది. ఇప్పటికే రాష్ట్రంలో ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ పనిచేస్తోంది. ఏఐ ఇన్నోవేషన్, ఏఐ స్టార్టప్స్.. ఇలా వేర్వేరు గ్రూపులుగా పనిచేస్తున్నాయి. హబ్ ద్వారా వీటన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకురానున్నారు. ఇందులో ఏఐ యూనివర్సిటీ కూడా నెలకొల్పనున్నారు. దీని ద్వారా మూడేళ్లలో 50 వేల మందికి పైగా తెలంగాణ యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలని, 10 వేల మందికి పైగా ఉద్యోగావకాశాలు కల్పించాలన్నది లక్ష్యం. అంతర్జాతీయ సంస్థలతో భాగస్వామ్యాలు, పేటెంట్లు కల్పించడం ద్వారా రాష్ట్రానికి ప్రపంచస్థాయిలో గుర్తింపు లభిస్తుందని ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో జరిగిన సమావేశంలో అధికారులు తెలిపారు. ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు చొరవతో.. హబ్ ఏర్పాటుపై పీపీటీ రూపొందించి, సీఎంకు చూపించారు. దీంతో హబ్ స్థాపనకు త్వరితగతిన ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఆమేరకు ఐటీ, పరిశ్రమల శాఖ దృష్టి సారించింది. ఫ్యూచర్ సిటీలో 200 ఎకరాల విస్తీర్ణంలో ఏఐ సిటీ ప్రారంభించేందుకు ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. అందుకు సమయం పట్టనుండటంతో.. తాత్కాలికంగా ఒక బహుళ అంతస్తుల భవనంలో 'ఏఐ ఇన్నోవేషన్ హబ్' ఏర్పాటుకు నిర్ణయించింది.

**టీఏఐహెచ్ ఎందుకంటే..**

రాష్ట్రంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ద్వారా 'తెలంగాణ ఏఐ మిషన్' 270కి పైగా ఏఐ స్టార్టప్‌లకు మద్దతు ఇస్తోంది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (డీఎస్‌టీ), టీహబ్ కలిసి సంయుక్తంగా 80 స్టార్టప్‌లకు సహాయం అందిస్తున్నాయి. కొత్తగా 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'ల స్థాపనకు పరిశ్రమలు చేసిన ప్రతిపాదనలు ప్రభుత్వం వద్ద ఉన్నాయి. ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన ఏఐ సదస్సు సందర్భంగా కిండ్రిల్, యోట్టా, మైక్రోసాఫ్ట్, అమెజాన్, గూగుల్, ఐఐఐటీ, బిట్స్, వాధ్వానీ ఫౌండేషన్, జికా వంటి సంస్థలు కూడా ప్రభుత్వంతో ఏఐకి సంబంధించి ఎంఓయూలు కుదుర్చుకున్నాయి. ఇవన్నీ వేర్వేరు గ్రూపులుగా పనిచేస్తుండడం వల్ల ఆశించిన ఫలితాలు వేగంగా రావడం లేదని, గ్లోబల్ ఏఐ హబ్‌గా ఆశించిన స్థానానికి చేరుకోవడంలో జాప్యమవుతోందని ప్రభుత్వం భావిస్తోంది. అందుకే ఒకే సంస్థ కింద అన్ని ఏఐ కార్యక్రమాలను చేర్చేందుకు 'తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్'ను తెరపైకి తెచ్చింది. ఇది పరిశ్రమలతో సమన్వయం చేసుకుంటూ.. స్వతంత్ర ప్రతిపత్తి సంస్థగా కొనసాగుతుంది. గ్లోబల్ కంపెనీలు, పరిశోధన సంస్థలు, ఇతర ఏఐ హబ్‌లతో భాగస్వామ్యాలను ఏర్పాటు చేస్తుంది.

# జగన్... నేను దేని గురించి మాట్లాడుతున్నానో మీకు బాగా తెలుసు!

వైసీపీ అధ్యక్షుడు జగన్ చేస్తున్న 'ఓట్ల చోరీ' ఆరోపణలపై రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో స్పందించారు. ఎన్నికల్లో ఓటమికి సాకులు వెతకడం మానుకోవాలని, 'నోట్ల చోరీ' వల్లే ప్రజలు వైసీపీని తిరస్కరించారని ఆయన ఘాటుగా విమర్శించారు. ఈ మేరకు బుధవారం ఆయన సోషల్ మీడియా వేదికగా జగన్‌ను ఉద్దేశించి వ్యాఖ్యలు చేశారు. తమ ప్రభుత్వానికి ఆంధ్రప్రదేశ్ ప్రజలతోనే నిజమైన 'హాట్‌లైన్' ఉందని లోకేశ్ అన్నారు. పదేపదే తప్పుడు ఆరోపణలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు ఫలించవని స్పష్టం చేశారు. "ఓట్ల చోరీ జరిగిందని చెప్పడం కాదు.. వరుస కుంభకోణాల్లో మీరు చేసిన నోట్ల చోరీ వల్లే ఓడిపోయారు. నేను దేని గురించి మాట్లాడుతున్నానో మీకు బాగా తెలుసు" అంటూ లోకేశ్ పరోక్షంగా మద్యం స్కామ్‌లను ఉద్దేశిస్తూ ఎద్దేవా చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలోని డబుల్ ఇంజిన్ సర్కార్ రాష్ట్ర ప్రగతికి కట్టుబడి ఉందని ఆయన పునరుద్ఘాటించారు. "మా డబుల్ ఇంజిన్ ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధికి కట్టుబడి ఉంది. ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు గారి నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్‌ను మళ్లీ దేశంలోనే నంబర్ 1 స్థానంలో నిలబెడతాం" అని లోకేశ్ ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించకుండా, నిరాధార ఆరోపణలు చేయడం తగదని ఆయన జగన్‌కు హితవు పలికారు.

## 79వ స్వాతంత్ర్య దినోత్సవం:
# రేపు జాతినుద్దేశించి రాష్ట్రపతి ప్రసంగం

దేశవ్యాప్తంగా 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సర్వం సిద్ధమైంది. ఈ వేడుకలను పురస్కరించుకుని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గురువారం (ఆగస్టు 14) జాతినుద్దేశించి ప్రసంగించనున్నారు. సాయంత్రం 7 గంటలకు ఈ ప్రసంగాన్ని ఆకాశవాణి, దూరదర్శన్ జాతీయ నెట్‌వర్క్‌లలో ప్రసారం చేయనున్నట్టు ప్రభుత్వ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. మొదట హిందీలో, ఆ తర్వాత ఆంగ్లంలో ఈ ప్రసంగం ఉంటుంది. అనంతరం దూరదర్శన్ ప్రాంతీయ ఛానెళ్లలో స్థానిక భాషల్లో ప్రసారం చేస్తారు. ఆకాశవాణి తమ ప్రాంతీయ నెట్‌వర్క్‌లపై రాత్రి 9:30 గంటలకు అనువాద ప్రసంగాలను ప్రసారం చేస్తుంది. శుక్రవారం (ఆగస్టు 15) ఉదయం, ప్రధాని నరేంద్ర మోదీ చారిత్రాత్మక ఎర్రకోట బురుజుల నుంచి సంప్రదాయబద్ధంగా జాతినుద్దేశించి ప్రసంగిస్తారు. 1947లో బ్రిటిష్‌పాలన నుంచి స్వాతంత్ర్యం పొందిన చారిత్రక ఘట్టానికి గుర్తుగా ఏటా ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఈసందర్భంగా దేశవ్యాప్తంగా జెండా వందనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకుంటారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నేపథ్యంలో దేశ రాజధాని ఢిల్లీలో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఇండియా గేట్, మండి హౌస్, మథురా రోడ్ వంటి కీలక ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. పార్కింగ్ లేబుల్స్ లేని వాహనాలు ఈ మార్గాలకు దూరంగా ఉండాలని అధికారులు సూచించారు. మరోవైపు, వేడుకల్లో పాల్గొనే ప్రజలు, అతిథుల సౌలభ్యం కోసం ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ (డీఎంఆర్సీ) ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఆగస్టు 15న అన్ని లైన్లలో ఉదయం 4 గంటల నుంచే మెట్రో సేవలు ప్రారంభమవుతాయని డీఎంఆర్సీ వెల్లడించింది. ఉదయం 4 గంటల నుంచి 6 గంటల వరకు ప్రతి 30 నిమిషాలకు ఒక రైలు నడుస్తుందని, ఆ తర్వాత యథావిధిగా సాధారణ షెడ్యూల్ కొనసాగుతుందని తెలిపింది. వేడుకల్లో భాగంగా ప్రజల్లో దేశభక్తిని నింపేందుకు ఢిల్లీలోని పలు ప్రముఖ ప్రదేశాల్లో సాయుధ దళాలు, కేంద్ర సాయుధ పోలీస్ దళాలు (సీఏపీఎఫ్), రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్పీఎఫ్), నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ) బ్యాండ్లతో ప్రత్యక్ష ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.

## తెలంగాణలో 4 రోజుల పాటు భారీ వర్షాలు...

**హైదరాబాద్ :** తెలంగాణలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. నాలుగు రోజుల పాటు రాష్ట్రంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో నీటిపారుదల శాఖ అధికారులకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇరిగేషన్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆయన హెచ్చరించారు. భారీ వర్షాల నేపథ్యంలో అన్ని విభాగాలకు సెలవులు రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రాజెక్టులు, ఆనకట్టలు, కాలువలతో పాటు చెరువులపై నిఘా పెంచాలని ఉత్తమ్ సూచించారు. ఎక్కడైనా విపత్తు సూచన కనిపిస్తే వెంటనే అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాలని తెలిపారు. క్షేత్ర స్థాయిలో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ఆయా జిల్లాల కలెక్టర్లతో పాటు అన్ని విభాగాల అధికారులతో ఇరిగేషన్ అధికారులు సమన్వయం చేసుకుంటూ పని చేయాలని చెప్పారు. ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటూ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ మేరకు ఆయన నీటిపారుదల శాఖ చీఫ్ సెక్రటరీ రాహుల్ బొజ్జా, స్పెషల్ సెక్రటరీ జీవన్ పాటిల్, జాయింట్ సెక్రటరీ కె.శ్రీనివాస్, ఈఎన్సీ అంజాద్ హుస్సేన్ లతో పాటు జిల్లాల సీఈలకు ఆదేశాలు జారీ చేశారు.




## నేటి బాలలే రేపటి తెలంగాణ భవిష్యత్తు పౌరులు : మంత్రి సీతక్క



నేటి బాలలే రేపటి తెలంగాణ భవిష్యత్తుకు పునాదులని, సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించిన తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యసాధనలో వారి పాత్రే అత్యంత కీలకమని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క స్పష్టం చేశారు. బుధవారం సచివాలయంలో బాలల హక్కుల కమిషన్ కార్యకలాపాలపై నిర్వహించిన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బాలల హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ సీతా దయాకర్ రెడ్డి, సభ్యులు, కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ సృజనతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. బాలల హక్కుల కమిషన్ ఇప్పటివరకు చేపట్టిన చర్యలు, ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కారానికి అవసరమైన వనరులపై సమావేశంలో విస్తృత చర్చ జరిగింది. జిల్లాస్థాయిలో మహిళా శిశు సంక్షేమ శాఖ నుండి మరింత సహకారం అందించాలని కమిషన్ విజ్ఞప్తి చేసింది. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, ప్రతి చిన్నారికి ఆరోగ్యకరమైన, సంతోషకరమైన బాల్యం అందించేందుకు మిషన్ వాత్సల్య ద్వారా చేపట్టాల్సిన కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని సూచించారు. జిల్లాల వారీగా సిబ్బంది నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అంతేకాకుండా, చైల్డ్ వెల్ఫేర్ కమిటీలు, జువైనల్ జస్టిస్ బోర్డు సభ్యుల నియామకానికి సంబంధించి తగినన్ని దరఖాస్తులు రాకపోవడంతో దరఖాస్తు గడువు పొడిగింపుపై న్యాయ సలహా తీసుకొని నిర్ణయం తీసుకోవాలని ఆదేశించారు. బాలల హక్కుల కమిషన్ క్షేత్రస్థాయిలో మరింత క్రియాశీలకంగా పనిచేసేందుకు తమ శాఖ నుండి పూర్తి సహకారం అందిస్తామని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు.

# కాంగ్రెస్ పాలించే రాష్ట్రంలో దొంగ ఓట్లు: ఎంపీ రఘునందన్‌రావు

రాహుల్ గాంధీ పార్టీ పాలించే తెలంగాణలోనే ఒక పల్లెటూరు లోనే 950 ఓట్లు కాస్త 2500 పెరిగాయని, అందుకే కేంద్రం బీహార్ నుంచి సర్వే మొదలు పెట్టిందని ఎంపీ రఘునందన రావు పేర్కొన్నారు. బుధవారం రాష్ట్ర ఎన్నికల అధికారికి మెదక్ నియోజకవర్గంలో ఐలపూర్ గ్రామంలో 700 పైగా దొంగ ఓట్లు ఎట్లా పెరిగాయనే అంశంపై ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మొదటి సారి పొరపాటు జరిగిందని 10 జనవరి ,2024 లో స్థానిక సర్పంచ్ తో కలిసి జిల్లా ఎన్నికల అధికారి కి ఫిర్యాదు చేశామన్నారు. పార్లమెంట్ ఎన్నికలకు ఇచ్చిన ఫైనల్ ఓటర్ లిస్టు కంటే నెల ముందు ఇచ్చామని, 19 జనవరి 2024న జిల్లా కలెక్టర్ కు అదే సర్పంచ్ చేత ఫిర్యాదు కూడా ఇప్పించామని తెలిపారు. 28 ఫిబ్రవరి 2024 న ఫైనల్ ఓటర్ లిస్టు వచ్చాక తహశీల్దార్ కు, అప్పటి సీఈఓ వికాస్ రాజ్ కు ఫిర్యాదు



చేసినట్లు తెలిపారు. ఒక చిన్న పల్లెటూరు లో 950 ఉండాల్సిన ఓట్లు దాదాపుగా 700 ఓట్లు ఎట్లా పెరిగాయని ప్రశ్నించారు. ఐలపూర్ లో ఉన్న ఇండ్ల వివరాలను 11 నుంచి 38 వరకు ఇండ్లు ఉంటే స్మశానవాటికకు, బోరింగ్ కు, ట్యాంక్ కు కూడా ఇంటి నెంబర్లు ఇచ్చి ఇష్టమున్నట్టు ఓటర్లను కలిపారని మండిపడ్డారు. 950 ఓట్లు ఉండాల్సిన ఐలపూర్ లో ఇప్పుడు చూస్తే ఏకంగా 2500 ఓట్లు కనపడుతున్నాయన్నారు. ప్రస్తుతం మరో నాలుగు పోలింగ్‌స్టేషన్ల కూడా పెరిగినట్లు చెప్పారు. కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ బెంగళూరు లో రెండు దొంగ ఓట్లను చూపి అడ్డగోలు విమర్శలు చేస్తున్నాడని, వేల ఓట్లు ఇక్కడ పెరిగితే వాటిని తొలగించవద్దా అంటూ నిలదీశారు. దొంగ ఓట్లకు మీ మద్దతు ఉన్నదా, దొంగ ఓట్లు తీసేస్తే మీకు భయం దేనికి అంటూ నిలదీశారు.

# భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- అత్యవసరమైతే తప్ప బయటికి రావద్దు
- ముస్తాబాద్ తహశీల్దార్ ఆర్.సురేష్

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ముస్తాబాద్ తహశీల్దార్ ఆర్.సురేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అధికార యంత్రాంగం నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో అధికారుల సూచనలను పాటించాలని సూచించారు. వర్షాలు కురుస్తున్నందు. ప్రజల భద్రత, ప్రాణా రక్షణను దృష్టిలో పెట్టుకొని డ్యామ్స్, పర్యాటక ప్రాంతాలను తాత్కాలికంగా మూసివేయడం జరిగిందని, సాధారణ పరిస్థితి వచ్చే వరకు అక్కడికి ఎవరు ప్రజలు వెళ్లకూడదని సూచించారు. ప్రజలకు ఎలాంటి ప్రమాదం తలెత్తకుండా తగిన ఏర్పాట్లతో ముందస్తుగా పకడ్బందీ చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ప్రజలు అధికారుల సూచనలు, సలహాలు పాటిస్తూ సహకరించాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, కాలువలు, నదులు, రిజర్వాయర్లు, చెరువుల వద్దకు వెళ్ళరాదన్నారు. చెట్ల కింద, పాడ్కెన భవనాలు కింద, శిధిలావస్థలో ఉన్న భవనాల్లో ఉండరాదని, విద్యుత్ స్థంభాలు, ట్రాన్స్ఫర్మర్స్ ముట్టుకోరాదని తెలిపారు. ఎవ్వరు కూడా ఎట్టిపరిస్థితుల్లో కూడా చెరువులోకి, నాలాలు, డ్యామ్స్, వాటర్ ఫాల్స్, చేపల వేటకు గాని వెళ్ళరాదని సూచించారు.


వరద నీటికి చెరువులు, కుంటలు నిండి చెరువు

కట్టలు తెగి పోయే ప్రమాదం ఉంటుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాహనదారులు ప్రయాణించేటప్పుడు జాగ్రత్తగా వెళ్లాలని, వర్షానికి రోడ్లు కొట్టుకుపోయి, గుంతలు ఏర్పడి అందులో నీరు నిల్వ ఉండి ఆ గుంతలు వాహనదారులకు కనిపించక ప్రమాదానికి గురి అయ్యి ప్రాణ నష్టం జరిగే ప్రమాదం ఉందని, జాగ్రత్తగా, నెమ్మదిగా చూసుకొని ప్రయాణించాలని సూచించారు. వర్షాలకు కల్వర్టు, చిన్న చిన్న బ్రిడ్జిల వద్ద నీరు ప్రవహిస్తున్నప్పుడు వాహనాలతో దాటడానికి సాహసం చేయరాదని సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో ముస్తాబాద్ తహశీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అత్యవసరమైతే వై.స్వామి (ఆర్ఎ)ను 9849183440కు సాయంత్రం 6 నుంచి ఉదయం 6గంటల వరకు సంప్రదించవచ్చని, ఎ.శ్రీనివాస్ (జెఎ) 9671013290కు ఉదయం 6 నుంచి సాయంత్రం 6 వరకు సంప్రదించవచ్చని తెలిపారు. అదేవిధంగా ముస్తాబాద్ జడ్పిహెచ్ఎస్‌లో రీహాబ్లీటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని, దీనికి గిర్దవార్ 2 ఎన్.రఘు ఇన్‌ఛార్జిగా ఉంటారని, ఏదైనా అవసరమైతే 6304616320కు సంప్రదించాలని తెలిపారు.


## బలవంతంగా నీటి బిల్లులు వసూలు చేస్తే సహించం

**:గోదావరి అంజిరెడ్డి**



జిన్నారం(బొల్లారం),ప్రజాస్ఫూర్తి 13: బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో అధికారులు బలవంతంగా నీటి బిల్లులు వసూలు చేస్తే ఊరుకోమని, స్థానికులు బిల్లులు కట్టొద్దని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి అన్నారు.బొల్లారంతో పాటు పరిశ్రమలతో నీటి కలుషితం కావడం వల్ల మున్సిపాలిటీ పరిధిలో నివసిస్తున్న ప్రజలకు ఉచితంగా మంచినీరు అందించాలని ఎమ్మెల్సీ అంజిరెడి హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై ఎండిని కలిసి కోరడం జరిగిందన్నారు.ఎండీ సానుకూలంగా స్పందించారని తెలిపారు. బొల్లారం మున్సిపాలిటీలో విధించిన నీటి పన్ను 17 కోట్లు ప్రజల నుండి వసూలు చేయకుండా చూడాలని వారికి సూచించడం జరిగిందన్నారు. బొల్లారం ప్రజలకు ఉచితంగా మంచినీరు అందే విధంగా బీజేపీ కృషి చేస్తామని హామీ ఇస్తామన్నారు. ఒకవేళ నీటి మీటర్లు పెడితే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామన్నారు. బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా బీజేపీ అండగా వుంటుందన్నారు.కార్యక్రమంలో బొల్లారం మున్సిపల్ బిజెపి ప్రెసిడెంట్ కేజీఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి,జిల్లా కౌన్సిల్ సభ్యుడు రవీందర్ రెడ్డి, జనరల్ సెక్రటరీ అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## కళాశాల విద్యార్థులచే ప్రతిజ్ఞ



జిన్నారం,ప్రజాస్ఫూర్తి 13: జిన్నారంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులచే మాదక ద్రవ్యాల నిరోధకంపై పోలీసులు ప్రతిజ్ఞ చేశారు. మాదకద్రవ్యాలు వాటి వల్ల కలిగే నష్టాలను వివరించారు. డ్రగ్ రహిత, ఆరోగ్యపూరిత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని కళాశాల ప్రిన్సిపాల్ కళింగ కృష్ణమూర్తి,సర్కిల్ ఇన్స్పెక్టర్ నయీముద్దీన్ తెలిపారు. అనంతరం మొదటి సంవత్సర విద్యార్థులకు నూతన ఏకరూప దుస్తుల పంపిణి చేశారు.

## కార్మికుల సంక్షేమమే సీఐటీయూ ధ్యేయం – భూక్య రమేష్

* **బేకరీ మాస్టర్స్, హెల్పర్స్ యూనియన్ నూతన కమిటీ**




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: కార్మికుల సంక్షేమం, అభ్యున్నతే సీఐటీయూ లక్ష్యమని జిల్లా కమిటీ సభ్యుడు భూక్య రమేష్ అన్నారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఒకవైపు యజమానుల అన్యాయాలకు, మరోవైపు కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నిరంతర పోరాటం చేస్తోందని తెలిపారు. ఐక్యత పోరాటమే ఆయుధం సీఐటీయూ 'ఐక్యత పోరాటం' నినాదంతో క్రమశిక్షణయుతమైన కార్మిక వర్గాన్ని చైతన్యం కల్పిస్తోందని ఆయన అన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం అనేకమంది కార్మిక నాయకులు ప్రాణత్యాగం చేసిన చరిత్రను గుర్తుచేశారు. కార్మికుల దిక్సూచి సీఐటీయూ దేశవ్యాప్తంగా కార్మిక వర్గానికి దిక్సూచి లాంటి పాత్ర పోషిస్తూ, సమస్యలపై ఛాలెంజ్‌గా నిలుస్తోందని భూక్య రమేష్ చెప్పారు. కార్మికులంతా సీఐటీయూలో చేరి మానవ విముక్తి కోసం ఐక్యంగా ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో బేకరీ యూనియన్ నాయకులు సత్తి కుమార్, శేఖర్, పాషా, రఫీ భాష, బాలకృష్ణ, ముజాహిద్, హరి తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులు ఆరోగ్యంగా, సంతోషంగా ఉండే వాతావరణం కల్పించడం మన అందరి బాధ్యత

**: జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్..**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: విద్యార్థులు ఆరోగ్యంగా, సంతోషంగా ఉండే వాతావరణం కల్పించడం మన అందరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. బుధవారం బూర్గంపాడు మండలం లోని తెలంగాణ గిరిజన బాలికల రెసిడెన్షియల్ పాఠశాల, జూనియర్ కళాశాల , వసతి గృహమును కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వస్తే గృహంలో గదులు తనిఖీ చేసి, గదుల పరిశుభ్రత, గాలి ప్రసరణ, త్రాగునీటి సదుపాయాలు, విద్యుత్ సదుపాయాలు వంటి మౌలిక వసతులు పరిశీలించారు. అనంతరం వంటగది, భోజనశాల, మరుగుదొడ్లు పరిశీలించి వాటి పరిశుభ్రతను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థినిలతో మమేకమై మాట్లాడుతూ మీకు ఏమైనా సమస్యలు ఉన్నాయా? మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా? వంటి ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. భోజనశాలలో విద్యార్థులకు వడ్డించటానికి సిద్ధంగా ఉన్న ఆహార పదార్థాలను తనిఖీ చేసిన కలెక్టర్ విద్యార్థులతో కలిసి భోజనం చేసి, భోజన సరఫరా విధానం, పరిశుభ్రత ప్రమాణాలను స్వయంగా పరిశీలించారు. భోజనం సరఫరాలో లోపాలు లేకుండా చూడాలని, పోషక విలువలతో కూడిన ఆహారమే అందించాలని వంట సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థినిలకు నాణ్యమైన విద్యతోపాటు సరైన సదుపాయాలు శుభ్రమైన వసతి, పోషకాహారంతో కూడిన భోజనం అందించడం ద్వారా మాత్రమే విద్యలో ఉత్తమ ఫలితాలు సాధించగలరని అన్నారు.అలాగే పాఠశాల ప్రాంగణంలో మునగ, కరివేపాకు, నిమ్మ గడ్డి వంటి ఉపయోగకరమైన మొక్కలను నాటించి, వాటిని విద్యార్థినులు స్వయంగా సంరక్షించేలా ప్రోత్సహించాలని సూచించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయులు , సిబ్బంది సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.





## 'గూడెం' వీధుల్లో ఆకతాయిల రౌడీయిజం

* **ఒకరిపై ఒకరు దాడి చేసుకున్న వైనం**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రం రౌడీ మూకలకు అడ్డాగా మారుతోంది. కళాశాలలు, పాఠశాలల సమీపంలో రౌడీమూకలు రెచ్చిపోతున్నారు. విద్యార్థినిలు, అమ్మాయిలు కన్పిస్తే చాలు వారిలోని రౌడీయిజం బయటకు వస్తుంది. ఒకరిపై ఒకరు దాడి చేసుకునే వరకు పరిస్థితులు చేరుకున్నాయి. పట్టణ నడిబొడ్డులోనే పరిస్థితులు ఇలా ఉండటంతో విద్యార్థినుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసుల నిఘా లేకపోవడం వల్లే ఆకతాయిలు రెచ్చిపోతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ద్విచక్రవాహనాలతో అమ్మాయిల ముందు 'షో'లు చేస్తూ ఒకవర్గంపై మరొకవర్గం దాడులకు తెగబడుతున్నారు. ముఖ్యంగా కొత్తగూడెం పట్టణంలోని సింగరేణి మహిళా కళాశాల, సెయింట్ మేరీస్ పాఠశాల సమీపంలోని ప్రైవేటు నర్సింగ్ కళాశాల, పోస్టాఫీస్ సెంటర్‌లోని వొకేషనల్ కళాశాల, డీఎస్పీ కార్యాలయం ఎదురుగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల, బస్టాండ్ ఎదురుగా ఉన్న ప్రైవేటు డిగ్రీ కళాశాల, లక్ష్మీదేవిపల్లిలోని వివిధ కళాశాలల వద్ద ఆకతాయిలు రోజురోజుకూ హంగామా సృష్టిస్తున్నారు. కొత్తగూడెం బస్టాండ్‌లోనూ పరిస్థితులు అదేవిధంగా ఉన్నాయి.

* **ఒకరిపై ఒకరు దాడి... బైక్ వదిలి పారిపోయిన పోకిరీలు..**

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్ సమీపంలోని నర్సింగ్ కాలేజీ వద్ద బుధవారం సాయంత్రం అల్లరి మూకలు రెచ్చిపోయాయి. ఓ ప్రైవేటు వొకేషనల్ కళాశాలకు చెందిన విద్యార్థులు రెండు వర్గాలుగా విడిపోయి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. సరిగ్గా సెయింట్ మేరీస్ పాఠశాల విద్యార్థులను విడిచిపెట్టే సమయంలో పాఠశాల సమీపంలోనే ఈ ఘర్షణ చోటు చేసుకోవడంతో పాఠశాల విద్యార్థులు బెంబేలెత్తిపోయారు. విద్యార్థుల కోసం వచ్చిన తల్లిదండ్రులు సైతం భయాందోళనకు గురయ్యారు. అక్కడే ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న ఓ కానిస్టేబుల్ రావడంతో ఘర్షణకు పాల్పడిన ఆకతాయి విద్యార్థులు పారిపోయారు. ఒక వర్గానికి చెందిన ద్విచక్రవాహనం వదిలి వెళ్లడంతో పోలీసులు దానిని స్వాధీనం చేసుకున్నారు. కాగా ఒక వర్గం విద్యార్థులు తమపై దాడికి పాల్పడ్డారంటూ కొందరు విద్యార్థులు చెప్పడంతో పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని సదరు కానిస్టేబుల్ సూచించారు. అయితే 'అమ్మాయి'ల కోసమే ఈ ఘర్షణ జరిగిందంటూ పలువురు చర్చించుకుంటున్నారు. ఇదిలా ఉండగా ప్రతిరోజు కళాశాల ముగిసిన తరువాత గంటపాటు ఆయా కళాశాలలు, పాఠశాలల వద్ద పోలీసులు గస్తీ నిర్వహించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## భూపతి పౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు చేయూత



ప్రజా స్ఫూర్తి నల్లగొండ : శాలిగౌరారం మండలంలోని వల్లాల జెడ్పీహెచ్ఎస్ మరియు ప్రాథమిక పాఠశాలలో బుధవారం భూపతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుమారు. 136 మంది విద్యార్థులకు ఒక లక్ష రూపాయల ఖర్చుతో షు బెల్టు, టై అందజేశారు.ఈ సందర్భంగా భూపతి ఫౌండేషన్ చైర్మన్ భూపతి ఉపేందర్ గౌడ్ మాట్లాడుతూ భూపతి ఫౌండేషన్ ద్వారా పేద విద్యార్థులకు మున్ముందు రాబోయే రోజులలో మరెన్నో మంచి పనులకు ఆర్థిక చేయూత కు శ్రీకారంచుడతామన్నారు. ఈ కార్యక్రమంలో వద్దు సైదులు దాగి దావీదు బొడ్డు వరమేష్, బొడ్డు మల్లేష్, నాగరాజు, యాదగిరి, అఖిల్, నరేందర్, వెంకన్న, నట్టు సైదులు, రాంబాబు పాల్గొన్నారు.

## ముంపు ప్రాంతాలలో ముందస్తు చర్యలు తీసుకోవాలి

**- బోడుప్పల్ కమిషనర్ శైలజ**



ప్రజాస్ఫూర్తి, బోడుప్పల్: రాబోయే 72గంటలలో భారీ వర్ష సూచన మరియు హెచ్చరికతో ఈ రోజు బోడుప్పల్ కమీషనర్ ఎ. శైలజా ఆధ్వర్యములో మధ్యాహ్నం 12:00 లకు సంబంధిత అధికారులు పోలీస్, రెవెన్యూ, ఇరిగేషన్,హెల్త్, హైడ్రా అధికారులతో ప్రత్యేక అత్యవసర సమావేశం మునిసిపల్ మీటింగ్ హాల్ లో నిర్వహించారు. నీటి ముంపు ప్రాంతాల్లో ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు ముందు జాగ్రత్త చర్యలపై అవగాహన కల్పించడం, అత్యవసర పరిస్థితుల్లో తక్షణ సహాయం అందించడం, ప్రమాద ప్రాంతాల గుర్తింపు, రక్షణ బృందాల సిద్ధం వంటి అంశాలపై సమావేశంలో చర్చ జరిగింది. అదే విధంగా కార్యా లయములో ఎమర్జెన్సీ అత్యవసరంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. కంట్రోల్ రూమ్ నెంబర్ : 04027215959 నెంబర్ ను సంప్రదించాలని కోరారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ నుంచి మేడిపల్లి మండలం తహసీల్దార్ హసీన, పోలీస్ ఇన్స్పెక్టర్ గోవింద రెడ్డి, ఇరిగేషన్ అసిస్టెంట్ ఇంజనీర్ పరమేష్, బోడుప్పల్ మెడికల్ ఆఫీసర్ ప్రణీత్, హైడ్రా అధికారులు, అసిస్టెంట్ మునిసిపల్ కమీషనర్ శ్యామ్ సుందర్ రావు, మునిసిపల్ అధికారులు, వార్డ్ ఆఫీసర్స్, వార్డ్ సూపెరవైసర్స్ పాల్గొన్నారు.

## ఆర్మీ వీరజవాన్ అనిల్ కుమార్ పార్థివ దేహనికి ఎమ్మెల్యే కోరం కనకయ్యా నివాళి


- **కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే గారు ప్రగాఢ సానుభూతి**



ప్రజాస్ఫూర్తి, ఇల్లందు: కారేపల్లి మండలం సూర్య తండా గ్రామంకు చెందిన ఆర్మీ వీరజవాన్ బానోత్ అనిల్ కుమార్ విధి నిర్వహనలో భాగంగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఆయన పార్థివ దేహాన్ని కారేపల్లి పోలిస్ స్టేషన్ లో సందర్శనార్థం ఉంచారు. ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య బానోతు అనిల్ కుమార్ పార్థివ దేహాన్ని సందర్శించారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ రక్షణ కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు. అనిల్ కుమార్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

### పూసపాల్లి jk 5 oc లో వ్యవసాయ భూములు కోల్పేతున్న రైతుల భూములను సందర్శించిన ఎంఎల్ఏ కోరం కనకయ్య

* **కొత్తగూడెం ఆర్డీవో మధు, సింగరేణి జీఎం కృష్ణయ్య ఇల్లందు తహాశీల్దార్ రవికుమార్**



ప్రజాస్ఫూర్తి ఇల్లందు : ఇల్లందు jk 5 oc ఎక్సటెంక్షన్ లో తిలక్ నగర్ పంచాయితీ పాత పూసపల్లి శివారులో ఉన్న వ్యవసాయ భూములను ఈరోజు ఇల్లందు ఎంఎల్ఏ కోరం కనకయ్య గారు కొత్తగూడెం ఆర్డిఓ ఇల్లందు తహాశిల్దార్ సందర్శించారు. ప్రాజెక్టులో భూములు కోల్పోతున్న రైతులకు భూమికి నష్టపరిహారం చెల్లించాలని ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని సంబధిత అధికారులను ఎంఎల్ఏ గారు ఆదేశించారు గత 5060సంవత్సరాలుగా తాతలు తండ్రులు దగ్గర నుంచి ఈ యొక్క భూమిని సాగుచేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్న రైతులకు భూమికి నష్టపరిహారం చెల్లించాలని లేని పక్షంలో భూములను సింగరేణి వారికి భూములను ఇచ్చేది లేదని ఎంఎల్ఏ గారు అన్నారు ఈయొక్క కార్యక్రమములో సింగరేణి అధికారులు అఖిల పక్షం కమిటీ నాయకులు రైతులు పాల్గొన్నారు.

# జ్యువెలరీ షాప్ యజమానులు తమ దుకాణాలు, పరిసర ప్రాంతాల్లో పటిష్టమైన భద్రత ఏర్పాట్లను చేసుకోవాలి

* తమ వ్యాపార సముదాయాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి : ఎస్పీ రోహిత్ రాజు*
* జిల్లా వ్యాప్తంగా ఉన్న జ్యువెలరీ వ్యాపారస్తులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి వారికి పలు సూచనలు చేసిన జిల్లా ఎస్పీ






ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు బుధవారం జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాలలో ఉన్న జ్యువెలరీ షాప్ యజమానులతో సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశాన్ని కొత్తగూడెం పట్టణంలోని ఐఎంఏ ఫంక్షన్ హాల్ నందు నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో గల జ్యువెలరీ షాపుల యజమానులు పాల్గొన్నారు.ఈ సమావేశంలో పాల్గొన్న జిల్లా ఎస్పీ రోహిత్ రాజు వారికి పలు సూచనలు చేశారు.బంగారు నగల దుకాణాల యజమానులు వారి దుకాణాలలో మరియు పరిసర ప్రాంతాల్లో పకడ్బందీగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా దొంగతనాలను నివారించవచ్చని తెలిపారు.దొంగతనాలకు పాల్పడిన నిందితుల వద్ద నుండి ఆభరణాలను కొనుగోలు చేయకూడదని,ఎవరైనా దొంగసొత్తును కొనుగోలు చేస్తే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. వ్యాపారస్తులు దొంగతనాలు జరగకుండా అరికట్టడానికి పోలీసు వారు సూచనలను పాటిస్తూ జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు.ఇటీవల కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న సంఘటనలను దృష్టిలో పెట్టుకొని ఈ సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. బంగారు నగలు వ్యాపారస్తులు తమ దుకాణాల పరిసరాలలో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.తమ తమ దుకాణాలలో పనిచేసే వ్యక్తుల గురించి,వారి ప్రవర్తన గురించి పూర్తి వివరాలు తెలుసుకొని మాత్రమే వారిని పనిలో పెట్టుకోవాలని సూచించారు.తమ దుకాణాల చుట్టుపక్కల ప్రాంతాల్లో నివసించే వారి కదలికలపై కూడా సరైన అవగాహన కలిగి ఉండాలని తెలిపారు.ఎక్కువ మొత్తంలో బంగారు ఆభరణాలను తమ దుకాణాలలో ఉంచవలసి వచ్చినప్పుడు సరైన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.తమ వ్యాపార సముదాయాల వద్ద సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేసుకొని రాత్రి వేళల్లో గస్తీని పెంచుకోవాలన్నారు.ఇప్పటివరకు జిల్లాలో జరిగిన పలు దొంగతనాల కేసుల్లో సీసీటీవీ కెమెరాల ఆధారంగా, పోలీస్ శాఖ వినియోగిస్తున్న సాంకేతికతను ఆధారంగా నిందితులను పట్టుకొని బాధితులకు న్యాయం చేకూర్చడం జరిగిందని అన్నారు.దొంగతనాలు జరగకుండా ప్రతి ఒక్కరూ ముందస్తు జాగ్రత్తలు తీసుకుని పోలీసు వారికి సహకరించాలని కోరారు.అనంతరం ఈ సమావేశంలో పాల్గొన్న బంగారు నగల దుకాణాల యజమానుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ,ఇల్లందు డిఎస్పి చంద్ర భాను,కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్,మణుగూరు డిఎస్పి రవీందర్ రెడ్డి,పాల్వంచ డిఎస్పీ సతీష్ కుమార్,సీసిఎస్ సీఐ రమాకాంత్, చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు, కొత్తగూడెం 2టౌన్ ఇన్స్పెక్టర్ ప్రతాప్, 1టౌన్ ఇన్స్పెక్టర్ కరుణాకర్,3టౌన్ ఇన్స్పెక్టర్ శివ ప్రసాద్, ఇతర పోలీసు అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## ఉప ఎన్నికల ఓట్ల లెక్కింపు



నిన్న జరిగిన పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికల ఓట్ల లెక్కింపు రేపు జరగనుంది. కడప పాలిటెక్నిక్ కళాశాలలో కౌంటింగ్ జరగనుంది. పులివెందుల జడ్పీటీసీ కౌంటింగ్‌కు పది టేబుళ్లు ఏర్పాటు చేశారు. ఒకే రౌండ్‌లో ఈ ఓట్ల లెక్కింపు జరుగుతుంది. అదే విధంగా ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికకు సంబంధించి పది టేబుళ్లు ఏర్పాటు చేశారు. ఇక్కడ రెండు రౌండ్లలో కౌంటింగ్ జరుగుతుంది. ఒక్కో టేబుల్‌పై 1,000 ఓట్లు లెక్కించేలా ఏర్పాట్లు చేశా రు. మధ్యాహ్నానికి ఓట్ల లెక్కింపు పూర్తవుతుంది. నిన్నటి ఎన్నికల్లో ఒంటిమిట్టలో 84.05 శాతం, పులివెందులలో 76.44 శాతం పోలింగ్ జరిగింది. అయితే ఇక్కడ భారీ రిగ్గింగ్ జరిగిందని వైసీపీ ఆరోపిస్తోంది. ఎన్నికలు పారదర్శకంగా జరిగాయని టీడీపీ చెబుతోంది.

## లిక్కర్‌స్కాంలో నిందితులకు రిమాండ్ పొడిగింపు

ఏపీ లిక్కర్‌స్కాం కేసులో నిందితులకు ఈనెల 26 వరకు రిమాండ్‌ను పొడిగిస్తూ విజయవాడ ఏసీబీ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఇవాళ్టితో వారి రిమాండ్ ముగిసిన నేపథ్యంలో నిందితులను సిట్ అధికారులు కోర్టులో హాజరుపర్చారు. మరింత విచారణ జరపాల్సి ఉందని అధికారులు కోరడంతో నిందితులకు న్యాయస్థానం రిమాండ్‌ను పొడిగించింది. ప్రస్తుతం విజయవాడ జిల్లా జైలులో రాజ్ కెసిరెడ్డి, చాణక్య, దిలీప్, సజ్జల శ్రీధర్‌రెడ్డి, ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, గోవిందప్ప బాలాజీ , గుంటూరుజైలులో నవీన్ కృష్ణ, బాలాజీకుమార్ యాదవ్ రిమాండ్‌లో ఉన్నారు. రాజమహేంద్రవరంలో మిథున్‌రెడ్డి జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నారు. వారిని జీపు ఎక్కించే క్రమంలో వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మరోసారి హడావుడి చేశారు. తానేమీ తప్పు చేయలేదని.. అన్యాయంగా తనను ఈ కేసులో ఇరికించారంటూ చెవిరెడ్డి ఆవేశంతో బిగ్గరగా అరిచారు.




## భారత దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్

* ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్షులు ఆకారం రేవంత్
* ఘనంగా ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: భారత దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్షులు ఆకారం రేవంత్ అన్నారు. ఏఐఎస్ఎఫ్ ముస్తాబాద్ మండల సమితి ఆధ్వర్యంలో 90 వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్షులు ఆకారం రేవంత్ జెండా ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ భారత దేశ స్వాతంత్ర్యమే లక్ష్యంగా దేశంలోనే మొట్టమొదటి విద్యార్థి సంఘంగా ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నో మహానగరంలో భగత్ సింగ్, రాజ్ గుర్, సుఖ్ దేవ్, ఆజాద్ ల ఇంకా ఎందరో వీరుల ఆశయ సాధన కోసం బబ్బుద్దీన్, ప్రేమ్ నారాయణ భార్గవ్ల నాయకత్వాన 1936 ఆగస్టు 12న ఏఐఎస్ఎఫ్ ఆవిర్భవించిందని, బ్రిటీష్ సామ్రాజ్యవాదుల బానిసచేర నుంచి మాతృభూమి విముక్తికై సాగిన వీరోచిత స్వాతంత్ర్య ఉద్యమంలో పొత్తిళ్లలోనే పిడికిళ్లు బిగించి స్వాతంత్ర్యము మా జన్మహక్కు అని మా అంతం చూసిన స్వాతంత్ర్యోద్యమ పంతం వీడం అంటూ నినాదించి భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని, భరతమాత బానిస సంకెళ్ళ నుంచి విముక్తి కావాలని ఎందరో విద్యార్థుల విప్లవ కిషోరులను బలిదానం చేసిన ఘనమైన చరిత్ర కలిగిన దేశములోనే ఏకైక విద్యార్థి సంఘం AISF అన్నారు. భవిష్యత్తులో జిల్లా వ్యాప్తంగా విద్యార్థుల సమస్యలపై సమశీల పోరాటాలకు సిద్ధం అవ్వండని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు రాగూడ ప్రణయ్, రాకేష్, అరవింద్, సాయి, అర్జున్, వివేక్, సాత్విక్, రాజు, వంశీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

**- జీడిమెట్ల ఇన్స్పెక్టర్ గడ్డం మల్లేష్**



ప్రజాస్ఫూర్తి, జీడిమెట్ల: గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని జీడిమెట్ల ఇన్స్పెక్టర్ గడ్డం మల్లేష్ సూచించారు. జీడిమెట్ల పోలీసుల ఆధ్వర్యంలో గణేష్ ఉత్సవ సన్నాక సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. వివిధ మండపాల నిర్వాహకులు, కాలనీ పెద్దలు పీస్ కమిటీ మెంబర్స్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ మల్లేష్ మాట్లాడుతూ రాబోయే వినాయక చవితిని విజయవంతంగా ప్రశాంతంగా జరుపుకోవడానికి పాటించాల్సిన మెలకువలు వివరించారు. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, విజయవంతంగా నిర్వహించడానికి తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. నిర్వాహకులు ఉత్సాహంగా వారి సూచనలు తెలిపారు. శాంతియుత వాతావరణాల్లో ఒక మంచి కార్యక్రమం ఈ వినాయక చవితిని పూర్తి చేసుకోవడానికి ముందస్తుగా ఈ ఏర్పాట్లు గౌరవ సిపి అవినాష్ మహంతి, డీసీపీ శ్రీ కె సురేష్ కుమార్ ల ఆదేశాల మేరకు ఏసిపి పి నరేష్ రెడ్డి ఆలోచన మేరకు ఈ యొక్క కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జీడిమెట్ల డిఐ ఎస్ కనకయ్య ఎస్సై ప్రేమ్ సాగర్ ఎస్సై సురేష్ అలాగే ఎస్ఐ సత్యనారాయణ అలాగే జీడిమెట్ల పోలీస్ సిబ్బంది పాల్గొనడం జరిగింది ఈ కార్యక్రమంలో వివిధ మండపాల నిర్వాహకులు దాదాపు 300మంది పాల్గొనడం జరిగింది.



## నాగార్జున వర్సిటీలోకి భారీగా వరద నీరు.. విద్యార్థుల పరిస్థితి దారుణం

గుంటూరులో విస్తారంగా వర్షాలు పడుతున్నాయి. దీంతో వాగులు, వంకలు, చెరువులు పొంగిపొర్లుతున్నాయి. అంతేకాదు ఈ నీళ్లు పలు చోట్ల ఇళ్లలోకి చేరాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జిల్లాలోని చాలా లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. రోడ్లపై కాలువలను తలిపించేలా నీటి ప్రవాహం కొనసాగుతోంది. దీంతో కొన్ని ప్రాంతాలకు రాకపోకలు నిలిపివేశారు. పలు చోట్ల కరెంట్ సరఫరా నిలిచిపోయింది. కొన్ని ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కిపోయాయి. నాగార్జున యూనివర్సిటీలోకి నీరు చేరింది.యూనివర్సిటీ ప్రాంగణంలో అడుగు మేర నీరు ఉండటంతో హాస్టల్ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హాస్టల్ చుట్టూ నీరు చేరడంతో లోపలికి వెళ్లేందుకు ఇక్కట్లు పడుతున్నారు. నిచ్చెన సాయంతో మొదటి అంతస్తులోకి విద్యార్థులు వెళుతున్నారు. అధికారులు స్పందించి మోటర్ల ద్వారా నీటిని బయటకు తరలించాలని విద్యార్థులు కోరుతున్నారు.

## జలదిగ్బంధంలో విజయవాడ బస్టాండ్.. బస్సులు నిలిపివేత

ఏపీలో పలు ప్రాంతాల్లో వర్షం దంచి కొడుతోంది. ఉదయం నుంచి కురిసిన వర్షంతో మరికొన్ని ప్రాంతాలు జలమయమయ్యాయి. విజయవాడలో ఎడతెరిపి లేకుండా కురిసిన వానతో లోతట్టు ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. విజయవాడ విద్యాధరపురం బస్టాండ్ మొత్తం నీళ్లు నిలిచిపోయాయి. ఈ మేరకు బస్సులన్నింటిని నిలిపివేశారు. బస్టాండ్ ప్రాంగణం మొత్తం 2 అడుగుల మేర నీళ్లు నిలిచి చెరువును తలపిస్తోంది. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. మోటార్లతో నీటిని తొలగిస్తున్నారు. మరోవైపు బస్సులు నిలిపివేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

## ఏడాది చివరిలోగా జిల్లాల పేర్లు, సరిహద్దుల మార్పు

ఈ ఏడాది డిసెంబర్ 31లోపు జిల్లాల పేర్లు, సరిహద్దుల మార్పులు ప్రక్రియ ముగిస్తామని మంత్రి అనగాని సత్యప్రసాద్‌వెల్లడించారు. ఈ రోజు సచివాలయంలో జిల్లాల పేర్లు, సరిహద్దుల మార్పులపై మంత్రుల బృందం తొలి భేటీ జరిగింది. సమావేశానికి మంత్రులు అనగాని సత్యప్రసాద్, పి.నారాయణ, వంగలపూడి అనిత, బిసి జనార్ధన్ రెడ్డి, నిమ్మల రామానాయుడు, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ హాజరయ్యారు. జిల్లాలు, మండలాలు, గ్రామాల పేర్లు, సరిహద్దుల మార్పులపై సెప్టెంబర్ 15వ తేదీ నాటికి తుది నివేదిక ఇవ్వాలని భేటిలో నిర్ణయించారు. ఈనెల 29, 30 తేదీల్లో ఉమ్మడి 13 జిల్లా కేంద్రాల్లో పర్యటించి ప్రజా ప్రతినిధులు, ప్రజల నుండి వినతులు స్వీకరించనున్నారు. ఈ లోపు కూడా ప్రజలు తమ వినతులను జిల్లా కలెక్టర్‌కు పంపించవచ్చని మంత్రులు తెలిపారు. సెప్టెంబర్ రెండో తేదీ వరకు మాత్రమే ప్రజలు,



ప్రజాప్రతినిధుల నుండి వినతులు స్వీకరిస్తారని తెలిపారు. గత ప్రభుత్వం గందరగోళంగా చేసిన జిల్లాల పునర్విభజనను సరిచేసేందుకే మంత్రుల బృందాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపిన మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడించారు. డిసెంబర్ 31లోపు జిల్లాల పేర్లు, సరిహద్దుల మార్పులు ప్రక్రియ ముగిస్తామని వెల్లడించారు. పరిపాలనా సౌలభ్యం, ప్రభుత్వానికి ఆదాయం పెరిగేలా మార్పులు కోసం కసరత్తు చేస్తామని తెలిపారు. రెవెన్యూ గ్రామాలు, మండలాలు, డివిజన్లు, జిల్లాలకు సంబంధించిన మార్పులపైన మంత్రుల బృందం పని చేస్తుందన్నారు. నియోజకవర్గాల జోలికి వెళ్లబోమని మంత్రి అనగాని తెలిపారు. కొత్త జిల్లాల ఏర్పాటు అంశాన్ని కూడా తాము పరిశీలిస్తామని.. అయితే పరిపాలనా సౌలభ్యమే గీటురాయి అని మంత్రి పేర్కొన్నారు.

## టీటీడీ, శ్రీవారికి భారీగా విరాళాలు






తిరుమల: బెంగుళూరుకు చెందిన కె.యం. శ్రీనివాసమూర్తి అనే భక్తుడు బుధవారం ఉదయం భోగ శ్రీనివాసమూర్తికి అలంకరించేందుకు రూ.25 లక్షలు విలువైన వజ్రం, వైజయంతి పొదిగిన 148 గ్రాముల బంగారు లక్ష్మీ పతకాన్ని విరాళంగా అందించారు. ఈ మేరకు శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో టీటీడీ అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరికి ఆభరణాన్ని అందజేశారు.

**టీటీడీకి రూ.కోటి విరాళం**

అలాగే బెంగుళూరుకు చెందిన కల్యాణ్ రామన్ కృష్ణమూర్తి అనే భక్తుడు బుధవారం టీటీడీ శ్రీవేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.కోటి విరాళంగా అందించారు. ఈ మేరకు తిరుమలలోని టీటీడీ అదనపు ఈవో క్యాంపు కార్యాలయంలో అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరికి విరాళం డీడీని అందజేశారు.

# ఐదేళ్ల తర్వాత భారత్ నుంచి చైనాకు విమాన సర్వీసులు..

ఐదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత భారత్ చైనా మధ్య నేరుగా విమాన సర్వీసులు పునఃప్రారంభం కానున్నాయి. వచ్చే నెలలో భారత్ చైనా మధ్య విమాన సర్వీసులను పునరుద్ధరించే అవకాశం ఉందని బ్లూమ్‌బర్గ్ నివేదిక వెల్లడించింది. ఎయిర్ ఇండియా, ఇండిగో వంటి విమానయాన సంస్థలు చైనా సర్వీసులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉండాలని భారత ప్రభుత్వం సూచించింది. 2020లో గల్వాన్ లోయలో జరిగిన సైనిక ఘర్షణలతో భారత్ చైనా మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. ఆ సమయంలోనే రెండు దేశాల మధ్య నేరుగా నడిపే విమాన సర్వీసులను రద్దు చేశారు. చైనాకు సంబంధించిన పలు యాప్‌లను భారత్ నిషేధించింది. చైనా పెట్టుబడులపై కేంద్ర ప్రభుత్వం సుముఖత చూపలేదు. చైనా దిగుమతులపై భారత్ కఠిన ఆంక్షలు విధించింది. అయితే, ఇటీవలి కాలంలో



రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు తగ్గించే దిశగా చర్యలు కొనసాగించడంతో ప్రస్తుతం సానుకూల సంకేతాలు కనిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే విమాన సర్వీసుల పునరుద్ధరణకు చర్యలు చేపట్టడం జరిగింది. ఇరుదేశాల మధ్య సంబంధాలు మెరుగుపడటంతో ఆర్థిక, వాణిజ్యపరంగా ఇండియా, చైనా దేశాలు అమెరికాను ఎదుర్కొనే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## ఎన్నికల్లో ఓడినా జగన్ ఆలోచనా విధానం మారలేదు: తెలంగాణ ఎంపీ చామల

**హైదరాబాద్:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిపై వైకాపా అధ్యక్షుడు జగన్ చేసిన వ్యాఖ్యలు సరికాదని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో జగన్ చేసిన వ్యాఖ్యలపై చామల స్పందించారు. ''ఏపీ ఎన్నికలపై రాహుల్ మాట్లాడలేదనడం సరికాదు. చంద్రబాబు, రేవంత్ వల్లే రాహుల్ మాట్లాడలేదని జగన్ అన్నారు. ఎన్నికల్లో ఓడిపోయినా ఆయన ఆలోచనా విధానం మారలేదు. ఏపీలో తప్పులు జరిగితే ఈసీ, మోదీని విమర్శించండి. వారిని తప్పుపట్టకుండా రాహుల్‌ను విమర్శించడమేంటి? విజయవాడ



ధర్నాలో రాహుల్‌తో కలిసి జగన్ పాల్గొనాలి'' అని చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు.

### కోదండరామ్, అమీర్ అలీఖాన్..

## నియామకంపై స్టే.. సుప్రీం సంచలన తీర్పు

**ఢిల్లీ :** తెలంగాణలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీ నియామకాలపై సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. తెలంగాణ జనసమితి అధ్యక్షుడు కోదండరామ్, అమీర్ అలీఖాన్ నియామకాలపై సర్వోన్నత న్యాయస్థానం స్టే విధించింది. వారి నియామకాలను నిలిపివేస్తూ తీర్పు ఇచ్చింది. ఎమ్మెల్సీలుగా కోదండరామ్, అమీర్ అలీఖాన్ నియామకాలను భారత రాష్ట్ర సమితి నేత దాసోజు



శ్రవణ్, సత్యనారాయణ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఆ పిటిషన్లపై విచారించిన సుప్రీంకోర్టు.. నేడు తీర్పు వెలువరించింది. తదుపరి ఉత్తర్వులకు అనుగుణంగా ఎంపిక ఉండాలని పేర్కొంటూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను ధర్మాసనం సవరించింది. మధ్యంతర ఉత్తర్వుల తర్వాత ప్రమాణస్వీకారం చేయడం తప్పు అని సుప్రీంకోర్టు పేర్కొంది.

## ఎన్నికలు ఉన్నాయని బిహార్‌కు ఎరువుల తరలింపు: హరీశ్‌రావు ఆరోపణ

**సిద్దిపేట :** మాజీ మంత్రి, భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే హరీశ్‌రావు సిద్దిపేట జిల్లాలోని రాఘవాపూర్‌లో పర్యటించారు. రైతులు ఎరువుల కోసం క్యూలో నిల్చోవడాన్ని చూసి ఆయన ఆగారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఓటీపీ, ఒక బస్తా విధానం తీసేయాలన్నారు. ప్రభుత్వం సబ్సిడీ నుంచి తప్పించుకునేందుకు కృత్రిమ కొరతను సృష్టిస్తోందని విమర్శించారు. ఎన్నికలు ఉన్నాయని బిహార్‌కు ఎరువులు తరలిస్తున్నారని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్, భాజపాకు గుణపాఠం చెప్పాలన్నారు.


**మంత్రి ఉత్తమ్‌కు హరీశ్‌రావు లేఖ**

నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి హరీశ్‌రావు లేఖ రాశారు. కాళేశ్వరం ప్రాజెక్టు కింద ఉన్న జలాశయాలు నింపాలని అందులో విజ్ఞప్తి చేశారు. మధ్య మానేరు, అన్నపూర్ణ, రంగనాయక్‌సాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ, బస్వాపూర్ జలాశయాలను నింపాలని కోరారు. రైతుల కోసం ఆరో ప్యాకేజీ వద్ద ఉన్న మోటార్లు ఆన్ చేయాలన్నారు. జలాశయాల్లో నీరు నింపకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని పేర్కొన్నారు.



### శంషాబాద్ ఎయిర్‌పోర్టులో

## పలు విమానాల దారి మళ్లింపు



**హైదరాబాద్ :** శంషాబాద్ ఎయిర్‌పోర్టులో పలు విమానాలను దారి మళ్లించారు. హైదరాబాద్‌లో భారీ వర్షాలు, ప్రతికూల వాతావరణం కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. మొత్తం 9 విమానాల్లో విజయవాడకు 5, బెంగళూరుకు 3, తిరుపతికి ఒక విమానాన్ని మళ్లించారు. హైదరాబాద్ నుంచి బయల్దేరాల్సిన మూడు విమానాలను తాత్కాలికంగా రద్దు చేశారు. అయితే మళ్లించిన వాటిలో 7 విమానాలు తిరిగి హైదరాబాద్‌కు చేరుకున్నట్లు ఎయిర్‌పోర్టు అధికారులు తెలిపారు.

## ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారం వేసే ప్రసక్తే లేదు: సీఎం

**అమరావతి :** ఆంధ్రప్రదేశ్‌ను 'గ్రీన్ ఎనర్జీ కారిడార్'గా తీర్చిదిద్దాలని, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా పునరుత్పాదక ఇంధన ఉత్పత్తిలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. అదే సమయంలో, విద్యుత్ ఛార్జీలు పెంచి వినియోగదారులపై ఎలాంటి భారం మోపవద్దని ఆయన స్పష్టం చేశారు. బుధవారం అమరావతిలోని తన క్యాంపు కార్యాలయంలో విద్యుత్ సరఫరా, పెట్టుబడులు, ఛార్జీల తగ్గింపు వంటి కీలక అంశాలపై సీఎం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, ఏపీ ట్రాన్స్‌కో, జెన్‌కో ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రపంచవ్యాప్తంగా మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రాష్ట్ర విద్యుత్ రంగంలో స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. "భవిష్యత్ అంతా గ్రీన్ ఎనర్జీదే. పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించి, ఆ ప్రయోజనాలను ప్రజలకు అందించాలి," అని ఆయన పేర్కొన్నారు. రాబోయే రెండు, మూడేళ్లలో రాష్ట్రంలో విద్యుత్ వినియోగం 8.9% పెరిగే అవకాశం ఉందని, ఈ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిని పెంచాలని సూచించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి ఆధునిక సాంకేతికతను ఉపయోగించి అతి తక్కువ ఖర్చుతో విద్యుత్ ఉత్పత్తి చేసే మార్గాలను అన్వేషించాలని అన్నారు.



*** ఛార్జీల భారం వద్దు.. ప్రత్యామ్నాయ ఆదాయంపై దృష్టి**

వినియోగదారులపై విద్యుత్ ఛార్జీల భారం వేసే ప్రసక్తే లేదని తేల్చిచెప్పిన సీఎం, ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలను అన్వేషించాలని అధికారులకు సూచించారు. ప్రస్తుతం ఏపీ ట్రాన్స్‌కో ఆధీనంలో ఉన్న ఫైబర్ ఆప్టిక్ నెట్‌వర్క్‌ను లీజుకు ఇవ్వడం ద్వారా అదనపు ఆదాయం సంపాదించవచ్చని తెలిపారు. ఈ విధానం ద్వారా దాదాపు రూ.7 వేల కోట్ల వరకు ఆదాయం పొందే అవకాశం ఉందని అంచనా వేశారు. బహిరంగ మార్కెట్‌లో విద్యుత్ కొనుగోళ్లను గణనీయంగా తగ్గించాలని, యూనిట్ కొనుగోలు వ్యయాన్ని రూ.4.80కి పరిమితం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని సీఎస్ విజయానంద్ ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి వివరించారు.

*** నష్టాలు తగ్గించి.. కొనుగోళ్లు నియంత్రించాలి**

రాష్ట్రంలో 9 శాతంగా ఉన్న విద్యుత్ పంపిణీ నష్టాలను గణనీయంగా తగ్గించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఫీడర్లను సమర్థవంతంగా నిర్వహించడం, స్థానికంగా ఉత్పత్తి అవుతున్న విద్యుత్‌ను అక్కడే వినియోగించడం ద్వారా ట్రాన్స్‌మిషన్ నష్టాలను అరికట్టవచ్చని అన్నారు. గతంలో తాను ప్రవేశపెట్టిన ఎనర్జీ ఆడిటింగ్ విధానాన్ని మళ్లీ అమలు చేసి విద్యుత్ చౌర్యాన్ని, నష్టాలను గుర్తించాలని సూచించారు. పెరిగే డిమాండ్‌ను ఎదుర్కొనేందుకు విద్యుత్ కొనుగోళ్లకు బదులుగా 'పవర్ స్వాపింగ్' వంటి విధానాలను అనుసరించాలని తెలిపారు.


*** సౌర, పవన విద్యుత్‌కు పెద్దపీట**

థర్మల్ విద్యుత్ యూనిట్‌కు రూ.5 నుంచి రూ.6 ఖర్చవుతుండగా, పవన విద్యుత్‌కు కేవలం రూ.4.6 మాత్రమే వ్యయం అవుతోందని సీఎం గుర్తుచేశారు. రాష్ట్రంలో 65 గిగావాట్ల పవన విద్యుత్ ఉత్పత్తికి అవకాశాలున్నాయని, ఆ దిశగా ప్రాజెక్టులను ప్రోత్సహించాలని అన్నారు. రాయలసీమలో పంప్డ్ ఎనర్జీ ప్రాజెక్టులకు విస్తృత అవకాశాలున్నాయని పేర్కొన్నారు. పీఎం సూర్యఘర్ సోలార్ రూఫ్ టాప్ పథకాన్ని వేగవంతం చేయాలని, ప్రతి నియోజకవర్గంలో కనీసం 10 వేల ఇళ్లకు ఈ పథకాన్ని వర్తింపజేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఈ పథకం పురోగతిపై ప్రతినెలా తానే స్వయంగా సమీక్షిస్తానని స్పష్టం చేశారు. అలాగే, వ్యవసాయానికి ఎక్కడా స్మార్ట్ మీటర్లు బిగించవద్దని సీఎం చంద్రబాబు కచ్చితమైన ఆదేశాలు జారీ చేశారు. పాతబడిన విద్యుత్ లైన్లను గుర్తించి, ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు 'ప్రెడిక్టివ్ మెయింటెనెన్స్' టెక్నాలజీని వాడాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

### నేడు, రేపు

## తెలంగాణ అంతటికీ రెడ్ అలర్ట్


**హైదరాబాద్ :** తెలంగాణ అంతటికీ ఇవాళ, రేపు రెడ్ అలర్ట్ జారీ చేసినట్లు వాతావరణ కేంద్రం డైరెక్టర్ నాగరత్న తెలిపారు. సంగారెడ్డి, వికారాబాద్, మెదక్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, యాదాద్రి భువనగిరి, ఖమ్మం, భద్రాద్రి, భూపాలపల్లి, ములుగు జిల్లాలకు రెడ్ కలర్ వార్నింగ్ జారీ చేసినట్లు తెలిపారు. హైదరాబాద్, హనుమకొండ, ఆదిలాబాద్, జనగామ, కామారెడ్డి, కుమురం భీం, ఆసిఫాబాద్, మహబూబాబాద్, మంచిర్యాల, నల్గొండ, రంగారెడ్డి, సిద్దిపేట, వరంగల్ జిల్లాలకు ఆరెంజ్ కలర్ వార్నింగ్ జారీ చేసినట్లు చెప్పారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. రాష్ట్రమంతటా రేపు కూడా వర్షాలు కొనసాగే అవకాశం ఉందని నాగరత్న వివరించారు. ''నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేశాం. రేపు మెదక్, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో అత్యంత భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. ఉత్తర తెలంగాణ



జిల్లాల్లో వర్ష తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ఇవాళ జీహెచ్‌ఎంసీ పరిధిలో రెడ్ అలర్ట్.. రేపు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశాం. రాష్ట్రంలో ఐదు రోజుల పాటు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయి. ఉత్తర తెలంగాణలో 17న వర్ష తీవ్రత అధికంగా ఉండే అవకాశం ఉంది. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయి'' అని నాగరత్న తెలిపారు.

### ఖమ్మంలో గంజాయి మత్తులో

## రెచ్చిపోయిన పోకిరీలు...



ఖమ్మం : జిల్లాలోని గోపాలపురంలో గంజాయి మత్తులో కొందరు పోకిరీలు రెచ్చిపోయారు. రోడ్డుపై వెళ్తున్న వాహనాలను ఆపి వాహనదారులను భయభ్రాంతులకు గురిచేసి వీరంగం సృష్టించారు. రోడ్డు పక్కన ఉన్న దుకాణాలపైనా దాడి చేసి హల్‌చల్ చేశారు. అల్లరిమూక కిరాణం షాపు, టూ వీలర్లపై పెట్రోల్ పోసి తగలబెట్టడంతో దుకాణదారులు అడ్డుకోబోగా వారిపై దాడికి దిగారు. ఈ దాడుల్లో ముగ్గురికి గాయాలయ్యాయి. గంజాయి మత్తులో పిల్లలు, మహిళల పైనా దాడికి యత్నించారు. గతంలోనూ ఇదే అల్లరి మూక దాడికి పాల్పడినట్లు బాధితులు చెబుతున్నారు.

### కంచ గచ్చిబౌలి అంశం..

## సమగ్ర ప్రణాళికతో వస్తే రాష్ట్ర ప్రభుత్వాన్ని అభినందిస్తాం: సుప్రీంకోర్టు

**ఢిల్లీ:** కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై సుప్రీంకోర్టులో మరోసారి విచారణ జరిగింది. వాదనల సందర్భంగా.. భూముల అభివృద్ధి కోసం సమగ్ర ప్రణాళికలు తయారు చేస్తున్నట్లు సుప్రీంకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ఈ ప్రతిపాదనను స్వాగతిస్తున్నట్లు సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ తెలిపారు. తాము అభివృద్ధికి వ్యతిరేకం కాదని ఆయన పేర్కొన్నారు. అదే సందర్భంలో.. పర్యావరణ పరిరక్షణను కూడా పరిగణనలోకి తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర ప్రణాళికతో ముందుకు వస్తే.. గతంలో చేసిన వ్యాఖ్యలను ఉప సంహరించుకుంటామని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ తెలిపారు. అంతే కాకుండా రాష్ట్ర ప్రభుత్వాన్ని అభినందిస్తామన్నారు. సమగ్ర ప్రణాళిక తయారు చేసి కోర్టుకు అందించేందుకు తమకు ఆరు వారాలు సమయం కావాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ఇందుకు సీజేఐ ధర్మాసనం అంగీకరించింది.



# వారి నుంచి నాకు ముప్పు ఉండొచ్చు: రాహుల్ గాంధీ

వి.డి.సావర్కర్‌ను ఉద్దేశిస్తూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై పరువునష్టం కేసు నమోదైన విషయం తెలిసిందే. అయితే.. సావర్కర్, గాడ్సే భావజాలాన్ని అనుసరిస్తున్న వారి నుంచి తనకు ముప్పు పొంచి ఉండొచ్చని రాహుల్ పుణె కోర్టుకు తెలిపారు. ఈ నేపథ్యంలో తనకు అవసరమైన భద్రత అందించడం కేంద్రం బాధ్యత అని పేర్కొన్నారు. 2023లో లండన్ పర్యటన సమయంలో సావర్కర్‌ను ఉద్దేశిస్తూ రాహుల్ గాంధీ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలో సావర్కర్ మునిమనవడు సాత్యకి సావర్కర్ ఆయనపై పరువునష్టం దావా దాఖలు చేశారు. ఈ కేసుకు సంబంధించి ప్రాథమిక ఆధారాలు ఉన్నట్లు పోలీసులు గతంలో తేల్చారు. దీనిపై పుణెలోని ప్రజాప్రతినిధుల కోర్టులో విచారణ ఇంకా ప్రారంభం కావాల్సి ఉంది. ఈ క్రమంలోనే రాహుల్ గాంధీ తరపు న్యాయవాది కోర్టుకు తాజాగా ఓ అప్లికేషన్ సమర్పించారు. ''తనకు నాథూరాం గాడ్సే, సావర్కర్ కుటుంబాలతో సంబంధం ఉందని సాత్యకి గతంలో వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఆయన గత చరిత్రను దృష్టిలో పెట్టుకుని, ప్రస్తుత రాజకీయ




వాతావరణాన్ని పరిగణనలోకి తీసుకుంటే.. సావర్కర్, గాడ్సే భావజాలానికి మద్దతు ఇచ్చే వ్యక్తుల నుంచి రాహుల్ గాంధీకి ముప్పు పొంచి ఉండే అవకాశాలను కొట్టిపారేయలేం. ఇటువంటి పరిస్థితుల్లో ఆయనకు రక్షణ కల్పించడం రాజ్యాంగబద్ధమైన బాధ్యత'' అని అందులో పేర్కొన్నారు. విచారణను ఆలస్యం చేయాలనే ఉద్దేశంతోనే రాహుల్ గాంధీ ఈ అప్లికేషన్‌ను దాఖలు చేశారని సాత్యకి సావర్కర్ ఆరోపించారు. అందులో పేర్కొన్న వాస్తవాలకు, ప్రస్తుత కేసుతో ఎటువంటి సంబంధం లేదని మీడియాతో అన్నారు. ఇదిలా ఉండగా.. ఈ కేసులో రాహుల్ గాంధీకి కోర్టు ఇప్పటికే బెయిల్ మంజూరు చేసింది.

# హైదరాబాద్‌లో భారీ వర్షం.. ప్రజలకు హైడ్రా కమిషనర్ సూచన

హైదరాబాద్ నగరంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. అధికారులకు ప్రజలు సహకరించాలని సూచించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో హైడ్రా కమిషనర్ మాట్లాడుతూ, భాగ్యనగరంలోని వివిధ ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. 51 డీఆర్ఎఫ్, 151 మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్‌లను సిద్ధంగా ఉంచామని ఆయన వెల్లడించారు. హైడ్రా బృందం 9 బోట్లను, ఎన్డీఆర్ఎఫ్ 6 బోట్లను సిద్ధంగా ఉంచిందని అన్నారు. హైదరాబాద్ నగరంలో 450 వరకు నీరు నిలిచే ప్రాంతాలు ఉన్నాయని, ఆయా ప్రాంతాల్లో సహాయక చర్యల కోసం అధికారులను సిద్ధం చేశామని తెలిపారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. నాలాలు, మూసీ పరివాహక ప్రాంతాల్లో, ముంపు ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. హుస్సేన్ సాగర్ నుంచి నీటిని ఎప్పటికప్పుడు విడుదల చేస్తూ జీహెచ్ఎంసీ అప్రమత్తంగా ఉందని తెలిపారు.

# గతంతో పోలిస్తే 'ఓటర్‌ఫ్రెండ్లీ'నే కదా!.. ఎస్ఐఆర్‌పై సుప్రీం కోర్టు

బిహార్ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ వివాదంపై సుప్రీం కోర్టు మరోసారి కీలక వ్యాఖ్యలు చేసింది. గతంలో ఏడు ధ్రువీకరణ పత్రాల కంటే ప్రస్తుతం 11 పత్రాలను అనుమతించడం ఓటరుకు ప్రయోజకరంగానే ఉందని వ్యాఖ్యానించింది. ఎస్ఐఆర్‌ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ కొనసాగించిన జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్య బాగ్చి ధర్మాసనం ఆధార్ మినహా అనేక డాక్యుమెంట్లను పరిగణనలోకి తీసుకోవడాన్ని గుర్తుచేసింది. ''గతంలో రాష్ట్రంలో నిర్వహించిన సమ్మరీ రివిజన్‌లో ఏడు ధ్రువపత్రాలను మాత్రమే అనుమతించారు. ఎస్ఐఆర్‌లో మాత్రం 11 డాక్యుమెంట్లను అనుమతించడం చూస్తుంటే ఓటరు అనుకూలంగానే కనిపిస్తోంది. ఆధార్ అనుమతించడం లేదనే పిటిషనర్ల వాదనను అర్థం చేసుకున్నప్పటికీ అనేక డాక్యుమెంట్లను వాస్తవానికి పరిగణనలోకి తీసుకుంటున్నారు'' అని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. దీనితో పిటిషనర్ తరఫు న్యాయవాది అభిషేక్ సింఘ్వీ విభేదించారు. ధ్రువపత్రాల సంఖ్య ఎక్కువగా ఉన్నప్పటికీ అవి అందరికీ అందుబాటులో లేవన్నారు. ఇందుకు పాస్‌పోర్టును ఉదహరించిన ఆయన.. రాష్ట్రంలో కేవలం ఒకటి, రెండు శాతం



మంది దగ్గర మాత్రమే ఇవి ఉన్నాయన్నారు. ఇందుకు ధర్మాసనం స్పందిస్తూ.. రాష్ట్రంలో 36లక్షల మంది పాస్‌పోర్టు కలిగి ఉన్నారని, ఇది మంచి సంఖ్య మాదిరిగానే కనిపిస్తోందని అభిప్రాయపడింది. ఆయా ప్రభుత్వ విభాగాల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకున్న తర్వాతే ధ్రువపత్రాల జాబితా రూపొందిస్తారని జస్టిస్ జోయ్‌మల్య బాగ్చి పేర్కొన్నారు. ఇదే అంశంపై ఆగస్టు 12న వాదనలు విన్న సుప్రీం ధర్మాసనం.. పౌరసత్వానికి సాక్ష్యాలుగా ఆధార్, ఓటరు ఐడీ కార్డులను పరిగణనలోకి తీసుకోలేమన్న ఈసీ వాదనలతో ఏకీభవించింది. వీటిని బలపరిచే మరికొన్ని పత్రాలూ ఉండాలని.. అయితే, దీనిని స్వతంత్రంగా పరిశీలించాల్సిన అవసరముందని అభిప్రాయపడింది. ఎన్నికల సంఘానికి ఈ అధికారం ఉందా అన్న అంశాన్ని మొదటగా నిర్ణయించాలని పేర్కొంది.

# ట్రంప్ టారిఫ్‌ల వేళ.. మాస్కోకు విదేశాంగ మంత్రి జైశంకర్

పాశ్చాత్య దేశాల ఆంక్షలు ఎదుర్కొంటున్న రష్యా నుంచి చమురు కొనుగోళ్లు నిలిపేయాలని..లేదంటే అధిక పన్నులు విధిస్తామని అమెరికా భారత్‌పై బెదిరింపులకు దిగుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో భారత విదేశాంగ మంత్రి జైశంకర్ రష్యా పర్యటనకు వెళ్లనున్నట్లు అధికారిక వర్గాలు పేర్కొన్నాయి. ఈ నెల 2021 తేదీలలో మాస్కోలో పర్యటించనున్న విదేశాంగ మంత్రి ఇరుదేశాల మధ్య సంబంధాలపై ఆ దేశ విదేశాంగ మంత్రి సెర్గీ లావ్‌రోవ్ తో చర్చలు జరపనున్నట్లు సమాచారం. కాగా జాతీయ భద్రత సలహాదారు అజిత్ డోభాల్ ప్రస్తుతం మాస్కో పర్యటనలో ఉన్నారు. భారీ సుంకాలతో అమెరికా విరుచుకుపడుతున్న వేళ... రష్యాతో స్నేహాన్ని మరింత బలోపేతం చేసుకునే దిశగా భారత్ అడుగులువేస్తోంది. ఇందులో భాగంగానే భారత ప్రధాని మోదీ ఇటీవల రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు ఫోన్ చేశారు. ఈ సందర్భంగా ఇరువురు నేతలు ద్వైపాక్షిక బంధం బలోపేతంతో పాటు పెట్టుబడులు, వాణిజ్యం, ఆర్థిక విషయాలపై చర్చించుకున్నారని ఢిల్లీ, మాస్కోల నుంచి విడివిడిగా విడుదలైన అధికారిక ప్రకటనలు తెలిపాయి. ఉక్రెయిన్‌తో ఘర్షణ తాజా పరిస్థితిని పుతిన్ వివరించగా శాంతియుత చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలన్న తన సూచనను ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు. ఈ ఏడాది చివర్లో భారత్ పర్యటనకు వచ్చే పుతిన్‌కు ఆతిథ్యం ఇచ్చేందుకు ఎదురు చూస్తున్నట్లు రాసుకొచ్చారు. మరో వైపు 15వ తేదిన పుతిన్ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో భేటీ అవ్వనున్నారు.



ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలు, ఉక్రెయిన్‌తో యుద్ధం, వాణిజ్య ఒప్పందాలు మొదలైన విషయాలపై వీరిరువురు చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ సమావేశంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కూడా పాల్గొనే అవకాశముంది.

# టారిఫ్‌ల వేళ.. అమెరికా పర్యటనకు ప్రధాని మోదీ..!


రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నారనే కారణంతో భారత్‌పై 50 శాతం సుంకం విధించారు అమెరికా అధ్యక్షుడు ట్రంప్. ఈ క్రమంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రధాని నరేంద్ర మోదీ అమెరికాలో పర్యటించేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా ఇరుదేశాల మధ్య నెలకొన్న వాణిజ్య సమస్యల పరిష్కారానికి ట్రంప్‌తో భేటీ అయ్యే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సమావేశాల నిమిత్తం ప్రధాని మోదీ యూఎస్‌కు వెళ్లనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా ఉక్రెయిన్



అధ్యక్షుడు జెలెన్‌స్కీతో సహా పలువురు విదేశీ నేతలతో ఆయన ద్వైపాక్షిక చర్చలు జరపాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. జెలెన్‌స్కీ, మోదీ ఇటీవలే ఫోన్‌లో మాట్లాడుకున్న విషయం సంగతి తెలిసిందే. న్యూయార్క్ వేదికగా ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సమావేశం సెప్టెంబరులో జరగనుంది. దీనికి ప్రపంచదేశాల నాయకులు హాజరుకానున్నారు. రష్యాతో వ్యాపార సంబంధాలు కొనసాగిస్తుండటంతో భారత్‌పై ట్రంప్ మండిపడుతున్నారు. ఈ క్రమంలో భారత్‌పై 25శాతం సుంకాలు విధించిన ట్రంప్ దాన్ని 50శాతానికి పెంచారు. అంతకుముందు ప్రకటించిన పాత 25శాతం సుంకాలు ఇప్పటికే అమల్లోకి వచ్చాయి. మిగిలిన 25శాతం టారిఫ్‌లు ఈనెల 27 నుంచి అమల్లోకి రానున్నాయి. దీనికి ముందే యూఎస్‌తో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవాలని న్యూఢిల్లీ చర్చలు జరుపుతోంది.

# గుజరాత్ వ్యక్తులకు బిహార్‌లో ఓటర్ కార్డులా..? తేజస్వీ ఆరోపణలు

బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతోన్న వేళ ఈసీ ఆ రాష్ట్రంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ను నిర్వహించిన సంగతి తెలిసిందే. ఓటరు జాబితా నుంచి 65 లక్షల మంది ఓటర్లను తొలగించామని పేర్కొంటూ ఎన్నికల సంఘం ఇటీవల ముసాయిదా విడుదల చేసింది. దాంతో ఓటర్ల జాబితాలో అక్రమాలు చోటుచేసుకున్నాయని విపక్ష పార్టీలు ఆరోపిస్తున్నాయి. గుజరాత్ వ్యక్తులు బిహార్‌లో ఓటర్లుగా మారుతున్నారని తాజాగా ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ వ్యాఖ్యలు చేశారు. ''గుజరాత్‌కు చెందిన కొందరు వ్యక్తులు బిహార్‌లో ఓటు హక్కు పొందుతున్నారు. భాజపా ఇంఛార్జి భిఖుభాయ్ దల్సానియా పట్నా ఓటర్‌గా మారారు. 2024లో ఆయన గుజరాత్‌లో ఓటువేశారు. అక్కడ ఆయన పేరు తొలగించారు. బిహార్ ఎన్నికలు ముగిసిన తర్వాత ఆయన మళ్లీ ఎక్కడికి వెళ్తారు. ఇదంతా ఒక కుట్ర. ఎన్నికల కమిషన్‌తో కలిసి భాజపా మోసం చేస్తోంది'' అని తేజస్వి తీవ్ర విమర్శలు చేశారు. ఇటీవల ఈసీ ప్రకటించిన ప్రత్యేక సమగ్ర సవరణ జాబితాలో తన గుర్తింపు కార్డు నంబరు కనిపించలేదని, రాష్ట్రంలో 65 లక్షల ఓటర్ల పేర్లను తొలగించారని తేజస్వీ యాదవ్ ఆరోపించిన సంగతి తెలిసిందే. దీనిపై స్పందించిన ఈసీ.. అవి నిరాధారమని స్పష్టం



చేసింది. ముసాయిదా జాబితాలో 416 క్రమ సంఖ్య వద్ద తేజస్వి పేరు ఉందని, ఆయన చెప్పిన కార్డు ఫోర్జరీ చేశారా? అనే విషయంపై దర్యాప్తు చేస్తున్నామని తెలిపింది. ఎస్ఐఆర్‌ను సవాల్‌చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టులో విచారణ జరుగుతోంది. ఎన్నికల సంఘం(ఈసీ) చేపట్టిన ఈ కసరత్తుపై 'విశ్వాసం కోల్పోవడమే అసలు సమస్య. అంతకుమించి ఏమీ లేదు' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. వాస్తవాలు, గణాంకాలతో సిద్ధంగా ఉండాలని ఎన్నికల సంఘానికి సూచించింది. ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభానికి ముందు ఎంతమంది ఓటర్లు ఉన్నారు? గతంలో నమోదైన మరణాల సంఖ్య ఎంత? ఇప్పుడు నమోదు చేసిన మరణాల సంఖ్య ఎంత? వంటి వివరాలపై ప్రశ్నలు ఎదురయ్యే అవకాశం ఉందని చెప్పింది.

# పాత ఈ మెయిల్స్‌ను డిలీట్ కొట్టి.. నీటిని ఆదా చేయండి..!

యూకేలో నీటి ఎద్దడిని తట్టుకొనేందుకు అక్కడి ప్రభుత్వం ప్రజలను తమ ఇన్‌బాక్స్‌లను క్లీన్ చేయాలని చెప్పింది. మీరు చదివింది నిజమే..పాత ఈ మెయిల్స్‌ను డిలీట్ చేసి నీటిని కాపాడాలని సూచించింది. ప్రస్తుతం యూకేలో నీటి కరవు అత్యంత తీవ్రంగా ఉంది.

పాత ఈ మెయిల్స్, ఫొటోలను భద్రపర్చేందుకు క్లౌడ్ వ్యవస్థను వాడుకొంటారు. దీని కోసం భారీ డేటా సెంటర్లు అవసరం ఉంటుంది. వాటిల్లోని సిస్టమ్స్‌ను చల్లబర్చేందుకు పెద్ద ఎత్తున నీరు అవసరమవుతుంది. ఈ క్రమంలో నీటి వినియోగాన్ని తగ్గించేందుకు వీలుగా బ్రిటన్ ప్రభుత్వం పనికిరాని డేటాను డిలీట్ చేయాలని కోరింది. భారీ డేటా సెంటర్లు రోజుకు 50 లక్షల గ్యాలన్ల నీటిని వాడుకొంటాయి. ఆ నీరు 10,000 నుంచి 50,000 జనాభా ఉన్న పట్టణానికి సరిపోతుంది. ప్రస్తుతం బ్రిటన్ నాలుగో హీట్‌వేవ్‌ను ఎదుర్కొంటోంది. ఇంగ్లాండ్‌లోని ఐదు ప్రదేశాల్లో అధికారికంగా కరవు ఉన్నట్లు



ప్రకటించారు. మరో ఆరు ప్రదేశాల్లో తీవ్రమైన పొడివాతావరణం ఉంది. ప్రస్తుతం నీటి పొదుపు దేశానికి అత్యంత కీలకమైందని ఎన్విరాన్‌మెంట్ ఏజెన్సీలో డైరెక్టర్ ఆఫ్ వాటర్‌గా ఉన్న హెలెన్ పేర్కొన్నారు. నీటి కరవును ఎదుర్కొంటున్న ప్రదేశాల్లో ప్రజలు కచ్చితంగా కొన్ని నిబంధనలు పాటించాలని సూచించారు.

* గార్డెన్‌కు వాడుకోవడానికి వీలుగా వర్షపు నీటిని సేకరించే రెయిన్ బట్‌లు ఏర్పాటు చేసుకోవాలి.
* టాయిలెట్లు, వాష్‌రూముల్లో లీకేజీలను సరిచేసుకోవడం వల్ల రోజుకు 200400 లీటర్ల నీటిని పొదుపు చేయండి.
* వంటగదిలో వినియోగించిన నీటిని మొక్కల పెంపకానికి వినియోగించండి.
* లాన్‌లో నీటి వినియోగాన్ని తగ్గించండి.
* దంతాలు తోముకొనే లేదా షేవింగ్ సమయంలో ట్యాప్ వాటర్‌ను ఆపేయండి.

షవర్ కింద తక్కువ సమయం గడపండి.
పాత ఈ మెయిల్స్, ఫొటోలను డిలీట్ చేయండి.

# ఉక్రెయిన్ యుద్ధం.. ట్రంప్ పదనిసలు!

తాను అధికారంలోకి వస్తే 24 గంటల్లో ఉక్రెయిన్ రష్యా యుద్ధానికి తెరదించుతానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదేపదే పేర్కొన్న విషయం తెలిసిందే. అయితే, అధ్యక్షుడిగా జనవరి 20న పదవీ బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి.. పరిస్థితిలో ఎలాంటి మార్పు రాలేదు. ఇరుదేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందాన్ని కుదిర్చేందుకు ట్రంప్ తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. అయినప్పటికీ.. మూడున్నరేళ్ల యుద్ధంలో ఒకనెలలో ఎన్నడూ లేనన్ని మరణాలు (232) ఈ ఏడాది జూన్‌లో నమోదు కావడం గమనార్హం. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన ప్రారంభంలో పుతిన్ అనుకూల వ్యాఖ్యలు చేశారు. ఒప్పందం కుదుర్చుకోవడానికి కీవ్ కంటే మాస్కోనే ఎక్కువ సుముఖంగా ఉందన్నారు. కానీ, తాను ప్రతిపాదించిన ఒప్పందాన్ని ఆయన తిరస్కరించడంతో.. ఆయనపై కారాలు మిరియాలు నూరుతున్నారు. మరోవైపు.. ఫిబ్రవరి 28న ఓవల్ ఆఫీసులో తీవ్ర వాగ్వాదం అనంతరం జెలెన్‌స్కీ పట్ల సానుకూలతతో వ్యవహరిస్తున్నట్లు కనిపిస్తోంది. యుద్ధం ముగింపుపై శుక్రవారం అలాస్కాలో పుతిన్‌తో భేటీ కానున్నారు. ఈ నేపథ్యంలో.. రెండోసారి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఈ వ్యవహారంపై ట్రంప్ చేసిన కొన్ని కీలక వ్యాఖ్యలను పరిశీలిస్తే..

* జనవరి 31: ''ఉక్రెయిన్ యుద్ధం ముగిసిపోవాలని కోరుకుంటున్నాం. ఒకవేళ నేను అధ్యక్షుడిగా ఉంటే అసలు ఈ యుద్ధమే ప్రారంభమయ్యేది కాదు'' ఫిబ్రవరి 19: ''ఎన్నికలు నిర్వహించకుండా జెలెన్‌స్కీ ఓ నియంతలా పాలన చేస్తున్నారు. యుద్ధం విషయంలో ఆయన వెంటనే ఒక నిర్ణయానికి రావాలి. లేకపోతే.. దేశం మిగలదు'' ఫిబ్రవరి 28: ''లక్షల మంది ప్రాణాలతో జెలెన్‌స్కీ ఆటలాడుతున్నారు. ఆయన తీరు మూడో ప్రపంచ యుద్ధానికి దారితీయొచ్చు. ఇన్నాళ్లుగా సాయపడుతూ వస్తున్న దేశం (USA) పట్ల ఏమాత్రం కృతజ్ఞత లేకుండా, అమర్యాదగా ప్రవర్తిస్తున్నారు'' మార్చి 30: ''పుతిన్ చాలా కాలంగా తెలుసు. మేం ఎల్లప్పుడూ సఖ్యతతో ఉన్నాం. శాంతి ఒప్పందం దిశగా ఆయన ముందుకొస్తారని విశ్వసిస్తున్నా''
* ఏప్రిల్ 24: ''కీవ్‌పై రష్యా దాడులతో ఏ మాత్రం సంతోషంగా లేను. వారానికి 5 వేల మంది సైనికులు మరణిస్తున్నారు. మాస్కో వెంటనే దాడులను నిలిపేసి.. శాంతి ఒప్పందానికి రావాలి''
* ఏప్రిల్ 29: ''యుద్ధం కారణంగా ఉక్రెయిన్‌లో చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారు. వాళ్లను చంపేస్తున్నారు. ఇది చాలా బాధాకరం''

# అమెరికాలోని హిందూ ఆలయంపై దాడి

వేర్పాటువాదులు మరోసారి రెచ్చిపోయారు. అమెరికాలోని హిందూ ఆలయంపై దాడికి పాల్పడ్డారు. ఇండియానా రాష్ట్రం జాన్సన్ కౌంటీలోని అక్షర్ పురుషోత్తమ్ స్వామినారాయణ్ ఆలయంపై ఖలిస్థాన్ వేర్పాటు వాదులు దాడికి పాల్పడినట్లు ది హిందూ అమెరికన్ ఫౌండేషన్ 'ఎక్స్'లో పేర్కొంది. ఖలిస్థానీకి మద్దతుగా, భారత్‌కు వ్యతిరేకంగా దేవాలయంపై పలు ద్వేషపూరిత నినాదాలు రాశారని వెల్లడించింది. భక్తుల మనోభావాలు దెబ్బతినేలా ఇటువంటి ద్వేషపూరిత విధ్వంసాలను తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపింది. ఈ ఏడాదిలో అమెరికాలోని హిందూ దేవాలయాలపై ఇది నాలుగో దాడిగా నిర్వాహకులు పేర్కొన్నారు. మళ్లీ ఇటువంటి దాడులు జరగకుండా ఆలయం వద్ద భద్రత ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై కేసు నమోదు చేశామని స్థానిక పోలీసులు వెల్లడించారు. ఘటన వెనుక భారత వ్యతిరేక శక్తుల హస్తం ఉందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామన్నారు. దేవాలయాలపై జరుగుతున్న దాడులపై హిందూ అమెరికన్ ఫౌండేషన్ ఆందోళన వ్యక్తం చేసింది. యూఎస్‌లోని హిందూ దేవాలయాలకు తగిన భద్రత కల్పించాలని స్థానిక అధికారులకు విజ్ఞప్తి చేసింది.

# పుదీనా నిమ్మలా పుల్లగా.. ఆపిల్‌లా తియ్యగా!

గొంతు గరగరా... మూడ్ బాగా లేదా... నోటికి ఏమీ రుచించడం లేదా... అయితే ఓ పుదీనా చాయ్ తాగి చూడండి. ఎక్కడి సమస్యలక్కడే ఫటాఫట్‌మని దూరమై, కొత్త ఉత్సాహం ఉరకలేస్తుంది. పుదీనా అంటేనే పరిమళం, తాజాదనం కదా... మరి అలాంటి పుదీనాకి మరికొన్ని మనోహరమైన పరిమళాలూ, రుచులూ తోడైతే ఆ కాంబినేషన్ ఎలా ఉంటుందంటారు? పైనాపిల్ పుదీనా, చాక్లెట్ మింట్, ఆపిల్ పుదీనా అంటూ కొత్తగా వస్తున్న ఆ పుదీనా మొక్కల సంగతులేంటో తెలుసుకుందాం రండి...



ఒకప్పుడు... 'మింథే' అనే అందమైన వనదేవత ఉండేదట. ఆమె ఎక్కడుంటే అక్కడ చక్కని పరిమళాలు వెదజల్లుతూ, అక్కడి వాతావరణాన్ని సంతోషంగా ఉంచేదట. అదిచూసి హేడిస్ అనే రాజు ఆమెను ప్రేమించాడు. ఇదంతా నచ్చని అతని భార్య మింథేపైన కోపంతో 'నువ్వు శాశ్వతంగా భూమ్మీద ఒక మొక్కగా మారిపో' అని శపించిందట. అలా మింథే కాస్తా భూమ్మీద పడి 'మింట్'గా మారి ఇప్పటికీ ఆ పరిమళాలు వెదజల్లుతూనే ఉందనేది ఒక గ్రీక్ పురాణ కథ. పోషకాలపరంగానే కాకుండా పురాణాల్లో మొక్కగానూ మింట్‌కి వివిధ దేశాల్లో ఎంతో ప్రాధాన్యం ఉంది. మనకి తులసి మొక్క ఎలానో, కొన్ని దేశాల్లో ఈ మింట్ అలా అన్నమాట. దళసరి ఆకులతో, నలిపితే చక్కని పరిమళం వెదజల్లే పుదీనాని ఎవరైనా తేలిగ్గానే గుర్తుపట్టేస్తారు. కానీ పుదీనా అంటే ఆ ఒక్క రకమే కాదండోయ్... దీనిలోనూ బోలెడు రకాలున్నాయి. వీటిల్లో పండ్ల పరిమళాలు వెదజల్లే పైనాపిల్, స్ట్రాబెర్రీ, ఆపిల్, గ్రేప్‌ఫ్రూట్, లెమన్ మింట్ రకాలు ఒకెత్తయితే, భిన్నమైన రుచిని పంచే జింజర్, చాక్లెట్ రకాలు మరొకెత్తు.





### పండ్ల సువాసనలతో...

సాధారణంగా హెర్బల్ టీలూ, కాక్‌టెయిల్స్‌వంటివి చేస్తున్నప్పుడు వివిధ రకాల పండ్లతోపాటు వాటిల్లో సువాసన కోసమని కాసిని పుదీనా ఆకులు వేస్తుంటాం. ఆ పండ్లేమీ వేయకుండానే కేవలం పుదీనాతోనే ఆయా పండ్ల రుచులని తీసుకురాగల గుణం ఈ నయారకం పుదీనా మొక్కలకి ఉంది. ఉదాహరణకి పైనాపిల్ మింట్‌నే తీసుకోండి... సాధారణంగా పుదీనా ఆకులున్నట్టుగా ఆకుపచ్చ రంగులో కాకుండా, తెల్ల అంచు లేతాకుపచ్చ చీర కట్టుకున్నట్టుగా భలే చూడముచ్చటగా కనిపిస్తాయి దీని ఆకులు అసలు తెంప బుద్ధికాదు... మనసు గట్టి చేసుకుని తెంపామా, తియ్యని పైనాపిల్ వాసనలు వెదజల్లుతుంది. పుదీనా ఏంటీ, పైనాపిల్ వాసనలు రావడమేంటీ అనేగా మీ అనుమానం. అదే మరి... వీటి ప్రత్యేకత. పొదలా దట్టంగా అల్లుకుపోయే ఈ పైనాపిల్ మింట్ వాసనలో అనాస పండుని పోలి ఉంటుంది, రుచిలో తియ్యదనం ఉంటుంది. అందుకే దీన్ని జామ్‌లు, సలాడ్లు, ఐస్‌క్రీంలు, ఇతర స్వీట్ల తయారీలో ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. అటు ఇంటికి అందం తెచ్చే ఆర్నమెంటల్ ప్లాంట్‌గానూ, ఇటు వంటకాలకి రుచిని తీసుకురావడంలోనూ దీనికిదే సాటి. ఇక పోషకాల విషయానికొస్తే దీనిలోని యాంటీమైక్రోబియల్ గుణాలు ఇన్‌ఫెక్షన్లు దాడి చేయకుండా అడ్డుకుంటాయి. స్ట్రాబెర్రీ పండ్ల వాసన ఎంత బాగుంటుందో ప్రత్యేకంగా చెప్పాలా... స్ట్రాబెర్రీ మింట్ కూడా అచ్చంగా అటువంటి తియ్యని వాసనలే వెదజల్లుతుంది. టీల తయారీలో వాడే ఈ మొక్కని కుండీల్లో పెంచుకుంటే దోమలూ, ఇతర కీటకాలని ఇంట్లోకి రానీయదట. ఇక లెమన్ మింట్ విషయానికొస్తే... నలిపితే నిమ్మ వాసనే ఉంటుంది. నిమ్మకు ప్రత్యామ్నాయంగా వంటల్లోనూ వాడుకోవచ్చు. ఇవేకాదు... ఆరెంజ్, గ్రేప్‌ఫ్రూట్, ఆపిల్ సువాసనల్లోనూ పుదీనా మొక్కలు దొరుకుతున్నాయి. వీటితో హెర్బల్ టీలుచేసుకున్నా, జెల్లీలూ, ఐస్‌క్రీంలూ తయారుచేసినా ఆ పండ్ల వాసననే వెదజల్లుతాయి. అలాగని పూర్తిగా పుదీనా సువాసన ఉండదని కాదు, రెండూ కలిపిన ఒక కాంబినేషన్ అన్నమాట. వీటితోపాటు మరికొన్ని భిన్నమైన రుచుల్లోనూ పుదీనా దొరుకుతోంది.

### అల్లం రుచిలోనూ...

చల్లగా ఉండే వేళ... కాస్త అల్లాన్ని దంచి, పుదీనాని దిట్టంగా వేసి చేసే అల్లం చాయ్ తెలిసిందే. అసలు అల్లాన్నే వేయకుండా ఆ రుచినీ, ఘాటునీ తీసుకురావడమే జింజర్ మింట్ ప్రత్యేకత. పసుపు, పచ్చ రంగులు కలిసిన ఆకులతో తేలిగ్గా గుర్తుపట్టే ఈ జింజర్ మింట్ రుచిలో అల్లం ఘాటుని కలిగి ఉంటుంది. అందుకే దీన్ని మాంసాహార కూరల్లో ఎక్కువగా వాడతారు. తలనొప్పిని తగ్గించడం, జీర్ణశక్తిని పెంచడం ఈ అల్లం పుదీనా ప్రత్యేకత. ఇక చిన్నా, పెద్దా ఇష్టపడే చాక్లెట్ రుచిలోనూ పుదీనా దొరకడం విశేషం. చాక్లెట్ రంగు కాడలతో, వెనిల్లా సువాసనలతో ఉండే చాక్లెట్ మింట్‌ని ఈమధ్యకాలంలో చాలామంది ఇష్టపడుతున్నారు. అరె పుదీనాలో ఇన్ని రకాలున్నాయా... మాకూ కావాలి అంటారా? దగ్గర్లోని నర్సరీల్లో, ఆన్‌లైన్‌లో కానీ ప్రయత్నించి చూడండి... వీటిల్లో ఎన్ని వెరైటీలున్నాయో తెలుస్తుంది!



# పెళ్లి వేళ.. పాదాలూ అందంగా.. !

వివాహం.. జీవితంలో ఒకేసారి జరిగే వేడుక ఇది. అందుకే ఈ వేడుకలో నఖశిఖపర్యంతం అందంగా కనిపించాలని కాబోయే వధువులు ఆరాటపడుతుంటారు! ఈ క్రమంలో మోము విషయంలో ఎంత శ్రద్ధ వహిస్తారో.. పాదాల్నీ అంతే సున్నితంగా, అందంగా తీర్చిదిద్దుకోవడానికి ప్రయత్నిస్తుంటారు. ఫలితంగా పెళ్లిలో పాదాలకు పెట్టుకొనే మెహెందీ కూడా చాలా ఆకర్షణీయంగా కనిపిస్తుంది. మరి, మీరూ అదే ఆలోచనలో ఉన్నారా? అయితే ఈ విషయంలో కొన్ని చిట్కాలు దృష్టిలో ఉంచుకుంటే పాదాల్ని మరింత ఆకర్షణీయంగా కనిపించేలా చేయొచ్చంటున్నారు సౌందర్య నిపుణులు. అవేంటో తెలుసుకుందాం రండి..



### తేమనందించండి..

* కొంతమంది వధువులు ముఖం విషయంలో తీసుకున్న శ్రద్ధ పాదాల విషయంలో తీసుకోరు. ఫలితంగా అవి పొడిబారిపోయి పగులుతుంటాయి. ఇక పెళ్లి సమయం వచ్చేసరికి ఇబ్బందిగా ఫీలవుతుంటారు. మరి, అలా జరగకుండా ఉండాలంటే మనం చర్మానికి ఎలాగైతే రోజూ మాయిశ్చరైజర్ రాసుకుంటామో.. అలాగే పాదాలకూ నాణ్యమైన మాయిశ్చరైజర్ అప్లై చేసుకోవాలి. తద్వారా వాటికి తేమ అంది మృదువుగా కనిపిస్తాయి. ఒకవేళ బయటదొరికే మాయిశ్చరైజర్ కాకుండా సహజసిద్ధమైనవి కావాలంటే.. కొబ్బరి నూనె, అవకాడో నూనె, తేనె, గోరువెచ్చటి నీళ్లు.. వంటివి ఇందుకు దోహదం చేస్తాయి.

### ఇంట్లోనే ఇలా..

* కాబోయే వధువులు తమ పాదాలను మెరిపించుకోవడానికి పార్లర్లకు వెళ్లి పెడిక్యూర్, ఫుట్ మసాజ్.. వంటివి చేయించుకోవడం సహజం. అయితే ఇంట్లోనే సహజసిద్ధంగా లభించే పదార్థాలతో పాదాలను మరింత ఆకర్షణీయంగా కనిపించేలా చేయచ్చు. ఇందుకోసం ఒక టబ్బులో గోరువెచ్చని నీరు తీసుకొని అందులో కొన్ని గోళీలు (మార్బుల్స్), అరకప్పు ఎప్సం సాల్ట్, రెండు విటమిన్ ఇ క్యాప్సూల్స్, కొన్ని చుక్కల ఎసెన్షియల్ ఆయిల్ (రోజ్, లావెండర్.. ఏదైనా) వేయాలి. ఇప్పుడు ఇందులో పాదాలను ఉంచి కాసేపు విశ్రాంతి తీసుకోవాలి. ఆ తర్వాత పాదాలను ముందు నుంచి వెనక్కి, వెనక నుంచి ముందుకు కదిలించాలి. ఫలితంగా నీటిలో ఉన్న మార్బుల్స్ వల్ల పాదాలకు చక్కటి వ్యాయామం కలుగుతుంది. ఆపై పాదాలను ఆరనివ్వాలి. ఇప్పుడు మాయిశ్చరైజర్ రాసుకుంటే సరిపోతుంది. ఇలా చేయడం వల్ల అలసిన పాదాలకు చక్కటి ఉపశమనం లభిస్తుంది.

### కాసేపు నడవాలి..

* ఎక్కువసేపు కూర్చోవడం వల్ల కొందరి పాదాలు నీరొచ్చినట్లుగా కనిపిస్తాయి. అంతేకాదు.. ఇలా లేవకుండా కూర్చొనే ఉండడం వల్ల పాదాలకు సరైన రక్తప్రసరణ సైతం జరగదు. కాబట్టి మధ్యమధ్యలో కాసేపు లేచి నడవడం మంచిదంటున్నారు నిపుణులు. ఫలితంగా పాదాలను ఆరోగ్యంగా కాపాడుకోవచ్చు.

### శుభ్రం చేయాల్సిందే..

* చాలామంది ఆఫీసుకు టైమైపోతుందని ఆదరాబాదరాగా స్నానం ముగించేస్తుంటారు. దీంతో పాదాలను సరిగ్గా శుభ్రం చేసుకోలేకపోతారు. ఫలితంగా వాటిపై పడిన దుమ్ము, ధూళి.. మొదలైనవి వాటి ఆరోగ్యాన్ని పాడుచేస్తాయి. అలాగే పాదాలను పొడిగా, నిర్జీవంగా మారుస్తాయి. కాబట్టి రోజూ స్నానం చేసేటప్పుడు, బయటికి వెళ్లొచ్చిన తర్వాత కాలి గోళ్లతో సహా పాదాలు, మడమలను బ్రష్ లేదంటే ప్యూమిస్ స్టోన్‌తో మృదువుగా రుద్దుకోవాలి. ఫలితంగా పాదాలు శుభ్రపడడంతో పాటు వాటిపై ఉన్న మృతకణాలు సైతం తొలగిపోతాయి. ఆ తర్వాత పొడిగా తుడుచుకొని మాయిశ్చరైజర్ రాసుకుంటే సరి..

# వర్షాల్లో.. పిల్లలు జబ్బు పడకుండా!

**వర్షా కాలం బోలెడు వ్యాధులను వెంట పెట్టుకొస్తుంది. వీటికి తోడు దోమలు, కలుషిత నీరు, ఆహారం పిల్లల ఆరోగ్యాన్ని మరింత ప్రమాదంలోకి నెడతాయి. అందుకే ఈ కాలంలో తల్లిదండ్రులు పిల్లల ఆరోగ్యం విషయంలో మరింత శ్రద్ధ వహించాలంటున్నారు వైద్య నిపుణులు.**

* పిల్లల్లో రోగనిరోధక శక్తి పెరిగేలా వివిధ పోషకాలతో కూడిన ఆహారం అందించాలి.
* కూరగాయలు, పండ్లను ఉప్పు నీటితో శుభ్రం చేసిన తర్వాతే పిల్లలకు అందించాలి.
* మసాలాలు, ప్రాసెస్డ్, ఫాస్ట్ ఫుడ్స్‌కు పిల్లలను దూరంగా ఉంచాలి. వీలైనంత వరకు ఇంట్లో తయారుచేసిన ఆహారానికే ప్రాధాన్యమివ్వాలి.
* భోజనానికి ముందు, వాష్‌రూంకు వెళ్లొచ్చిన తర్వాత పిల్లలు తమ చేతులు శుభ్రంగా కడుక్కునేలా జాగ్రత్త వహించాలి.
* ఫంగల్ ఇన్ఫెక్షన్లకు దూరంగా ఉండేందుకు పిల్లలు తడి దుస్తులు, చెప్పులు, సాక్స్‌లు ధరించకుండా చూడాలి.
* దోమ కాటు నుంచి రక్షణ పొందేందుకు వీలుగా ఫుల్ స్లీవ్స్ ఉన్న దుస్తులనే పిల్లలకు తొడగాలి.
* తులసి, లావెండర్.. వంటి మొక్కలను ఇంటి ఆవరణలో పెంచుకుంటే దోమల బెడద నుంచి తప్పించుకోవచ్చు.
* పూలకుండీలు, ఇంటి చుట్టుపక్కల పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి.
* ఇంట్లోని చెత్తను ఏరోజుకారోజు బయట పడేయాలి.
* వర్షాకాలంలో సీజనల్ అలర్జీలు సాధారణమే అయినప్పటికీ నిర్లక్ష్యం చేయకూడదు. వెంటనే వైద్యులను సంప్రదించడం మంచిది.






## నేడు థియేటర్లలోకి కూలీ రాక

**టాకీస్:** ఎప్పుడూ తన సినిమా సంగతులను పంచుకునే లోకేశ్ కనగరాజ్ వాటి విడుదలకు ముందు కచ్చితంగా పోస్ట్ పెడుతుంటారు. దీంతో 'కూలీ' విడుదలకు ముందు ఆయన పెట్టే పోస్ట్‌పై కొన్ని రోజులుగా అందరిలో ఆసక్తి నెలకొంది. ఆయన దర్శకత్వంలో రజనీకాంత్ కీలక పాత్రలో నటించిన చిత్రం 'కూలీ'. నాగార్జున, ఆమిర్‌ఖా న్, సత్యరాజ్, శ్రుతిహాసన్, సౌబిన్ షాహిర్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఆగస్టు 14న ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ఆయన ఈ సినిమాను ఉద్దేశిస్తూ రజనీకాంత్‌కు థాంక్స్ చెబుతూ పోస్ట్ పెట్టారు. ఆయన వల్లే ఈ సినిమాపై ప్రేక్షకులు ఇంత ప్రేమ చూపుతున్నారని పేర్కొన్నారు. చిత్రీకరణకు సంబంధించిన ఫొటోలను పంచుకున్నారు. నా సినీ ప్రయాణంలో 'కూలీ'కి ఎప్పుడూ ప్రత్యేక స్థానం ఉంటుంది. ఈ సినిమా ఇంత బాగా రావడానికి, దీనిపై ఇంత మంది ప్రేమ చూపించ డానికి కారణం తలైవానే. నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు ఆయనకు ఎప్పటికీ కృతజ్ఞతతో ఉంటా. 'కూలీ' చిత్రీకరణలో ఎన్నో మధురక్షణాలు ఉన్నాయి. వాటిని ఎప్పటికీ నా మనసులో దాచుకుంటాను' అని తెలిపారు. రజనీకాంత్ ఇండస్ట్రీక్రి వచ్చి మరో రెండు రోజుల్లో 50ఏళ్లు పూర్తి కానున్న సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఎంతో మందిలో స్ఫూర్తినింపుతున్నందుకు కృతజ్ఞతలు చెప్పారు. అపూర్వ రాగంగల్'తో రజనీకాంత్ ఇండస్ట్రీలోకి అడుగు పెట్టారు. 1975 ఆగస్టు 15న ఈ సినిమా విడుదలైంది. మరో రెండు రోజుల్లో దీనికి 50 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా సోషల్ మీడియాలో శు భాకాంక్షలు వెల్లువెత్తు తున్నాయి. తలైవాకు కంగ్రాట్స్ చెబుతూ సినీ ప్రముఖులు పోస్టులు పెడుతున్నారు. నటుడిగా నేను మొదటి సినిమా మీతోనే చేశా. నా గురువు లలో మీరూ ఒకరు. ఎంతో మందిలో స్ఫూర్తి నింపుతున్నందుకు ధన్యవాదాలు. మీరు మరిన్ని సినిమాలతో అలరించాలని కోరుకుంటున్నాను అని హృతిక్ రోషన్ అన్నారు. ఒక మనిషి.. ఒక కిరీటం.. 50 సంవత్సరాలు. ఈ గోల్డెన్ జూబ్లీని 'కూలీ'తో సెలబ్రేట్ చేసుకుందాం సంగీత దర్శకుడు అనిరుధ్ అన్నారు.

## చిక్కుల్లో ప్రభాస్ 'ది రాజా సాబ్' చిత్రం

### రూ.218 కోట్ల వివాదంతో విడుదలకు బ్రేక్ పడే ప్రమాదం!

**టాకీస్:** పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న తాజా హారర్ కామెడీ చిత్రం 'ది రాజా సాబ్' కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. డిసెంబర్ 5, 2025న ఈ చిత్రం విడుదల కానుందని అఫీషియల్‌గా ప్రకటించారు. మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా కోసం ఫ్యాన్స్ కళ్లల్లో ఒత్తులు వేసుకొని ఎదురు చూస్తుండగా, ఇప్పుడు ఊహించని మలుపు తిరిగింది. నిర్మాతల మధ్య జరిగిన నిధుల వివాదంతో సినిమా విడుదలపై అనిశ్చితి నెలకొంది. రాజాసాబ్ సినిమాను పీపుల్ మీడియా ఫ్యాక్టరీతో కలిసి నిర్మిస్తున్న ఐవీ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ, ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. 2023లో ఐవీ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ ఈ ప్రాజెక్టులో భాగస్వామిగా ఉండేందుకు అగ్రిమెంట్ చేసుకుంది. రూ.218 కోట్ల పెట్టుబడి పెట్టిన ఈ సంస్థ, లాభాల్లో వాటా, క్రెడిట్ లైన్ పైన అంగీకారం పొందింది.




అయితే ఐవీవై ఎంటర్‌టైన్‌మెంట్ ఆరోపించిన ప్రకారం.. సినిమాను ఆలస్యం చేస్తూ వస్తున్నారని,ప్రొడక్షన్ అప్‌డేట్స్ చెప్పడం లేదని, నిధుల వినియోగం పై పూర్తి వివరాలు అందించలేదని పేర్కొంది.అంతేకాకుండా, అనేకసార్లు రిలీజ్ వాయిదా వేయడం వంటివి చేస్తున్నారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో, ఐవీవై ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ 218 కోట్ల పెట్టుబడిపై 18 శాతం వడ్డీతో సహా తమకు రికవరీ ఇవ్వాలంటూ, సినిమా విడుదలను ఆపేయాలంటూ కోర్టులో పిటిషన్ వేసింది. అయితే ఐవీఏ ఎంటర్‌టైన్‌మెంట్ జారీ చేసిన నోటీసుల ప్రకారం.. టీజీ విశ్వ ప్రసాద్ (పీపుల్ మీడియా ఫ్యాక్టరీ), వివేక్ కుచిబోట్ల, డెక్కన్ డ్రీమ్స్ యానిమేషన్స్, ప్రసాద్ ఎక్స్‌ట్రీమ్ డిజిటల్, క్యూబ్ సినిమా టెక్నాలజీస్, యూఎఫ్‌వో మూవీస్ వారు ఏ పనైనా తమ అనుమతి లేకుండా చేయకూడదని సూచించింది. దీనిపై స్పందించిన పీపుల్స్ మీడియా సంస్థ రాజా సాబ్ చిత్రం నాన్ థియేట్రికల్ డీల్ ఇంకా క్లోజ్ కాలేదు. ఆ కారణం వల్లనే సినిమా వాయిదా పడింది. అయితే కావాలని తమ పరువుకు భంగం కలిగిస్తున్నారంటూ ఐవీవైపై కోర్టుని ఆశ్రయించింది. మొత్తానికి ఈ వివాదంతో రాజాసాబ్ చిత్రం ఇప్పట్లో వచ్చేలా కనిపించడం లేదు.
మారుతి దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమాలో ప్రభాస్ ద్విపాత్రాభినయం చేస్తుండగా,కథానాయికలుగా మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ నటిస్తున్నారు.సంజయ్ దత్ కీలక పాత్రలో కనిపించనుండగా,సంగీతాన్ని తమన్ అందిస్తున్నాడు. ఇప్పటికే విడుదలైన టీజర్‌కి మంచి స్పందన వచ్చింది.

# అగ్ర హీరోలు ఉన్నా.. ఆ భయం మాత్రం లేదు

### కూలీ మూవీని లోకేశ్ అద్భుతంగా రూపొందించారన్న శ్రుతి హాసన్

### లోకేశ్ మూవీల్లో భావోద్వేగాలతో పాటు వినోదానికి లోటు ఉండదన్న శ్రుతి

టాకీస్: ప్రముఖ కథానాయకుడు రజనీకాంత్ హీరోగా లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో రూపొందిన యాక్షన్ థ్రిల్లర్ మరికొన్ని గంటల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రంలో ప్రీతి పాత్రలో శ్రుతి హాసన్ నటించారు. ఆమె తాజాగా ఒక ఇంటర్వ్యూలో లోకేశ్ కనగరాజ్ ప్రతిభను ప్రశంసించారు.
ఈ సినిమాలో అగ్ర హీరోలు రజనీకాంత్, నాగార్జున, అమీర్ ఖాన్ వంటి ఎంతోమంది ఉన్నప్పటికీ, తన పాత్ర గుర్తింపు విషయంలో ఎలాంటి భయం లేదని ఆమె అన్నారు. లోకేశ్ ఈ చిత్రాన్ని అద్భుతంగా రూపొందించారని, ప్రీతి పాత్రకు న్యాయం చేకూరేలా స్క్రిప్ట్ రాశారని ఆమె తెలిపారు.
ఖైదీ, మాస్టర్, విక్రమ్ వంటి చిత్రాలతో వరుస విజయాలు సాధించిన లోకేశ్.. కూలీతో మరోసారి అందరినీ ఆశ్చర్యపరుస్తారని శ్రుతి హాసన్ అన్నారు. లోకేశ్ సినిమాల్లో ప్రేక్షకులకు నచ్చే యాక్షన్ సన్నివేశాలు, భావోద్వేగాలు, వినోదం పుష్కలంగా ఉంటాయని ఆమె పేర్కొన్నారు. కూలీ చిత్రం ప్రేక్షకుల అంచనాలకు ఏమాత్రం తగ్గదని, ప్రీతి పాత్ర మహిళలందరికీ నచ్చుతుందని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు.






## నా ఎదుగుదలను అడ్డుకుంటున్నారు.. డబ్బులిచ్చి ట్రోల్ చేయిస్తున్నారు: రష్మిక మందన్న

### ఆన్‌లైన్ ద్వేషం, ట్రోలింగ్‌పై రష్మిక మందన్న ఆవేదన

### అందరికీ నేనే పంచ్ బ్యాగ్‌లా కనిపిస్తున్నానా అని ప్రశ్న

### డీప్‌ఫేక్ వీడియో తన కుటుంబాన్ని తీవ్రంగా భయపెట్టిందని వెల్లడి

**టాకీస్:** తెరపై ఎప్పుడూ చలాకీగా, నవ్వుతూ కనిపించే స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న తనలో దాచుకున్న తీవ్ర ఆవేదనను బయటపెట్టారు. కొన్నేళ్లుగా తాను ఎదుర్కొంటున్న ఆన్‌లైన్ ద్వేషం, ట్రోలింగ్ గురించి మాట్లాడుతూ ఆమె కన్నీటిపర్యంతమయ్యారు. ఓ నటిగా తన పని తాను చేసుకుంటున్నా, కొందరు తననే ఎందుకు లక్ష్యంగా చేసుకుని ఇంతలా వేధిస్తున్నారని ప్రశ్నిస్తూ భావోద్వేగానికి లోనయ్యారు. తన ఎదుగుదలను అడ్డుకోవాలనుకుంటున్నారని... డబ్బులిచ్చి మరీ ట్రోల్ చేయిస్తున్నారని మండిపడ్డారు.


ఇటీవల నిఖిల్ తనేజా హోస్ట్ చేసిన 'వి ఆర్ యువా' ప్లాట్‌ఫామ్‌లోని ఓ కార్యక్రమంలో రష్మిక పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "గత కొన్ని సంవత్సరాలుగా నాపై తీవ్రమైన ద్వేషం ప్రదర్శిస్తున్నారు. ప్రతీరోజూ నిద్రలేవగానే నన్ను ద్వేషిస్తూ వచ్చే నెగటివ్ కామెంట్లే కనిపిస్తాయి. అందరికీ నేనే పంచ్ బ్యాగ్‌లా కనిపిస్తున్నానా..? ఈ నొప్పిని నేను భరించలేకపోతున్నాను" అంటూ కన్నీళ్లు పెట్టుకున్నారు.

తన మార్ఫింగ్ డీప్‌ఫేక్ వీడియో ఘటనను గుర్తుచేసుకుంటూ రష్మిక తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. "ఆ డీప్‌ఫేక్ వీడియో వచ్చినప్పుడు నేను చాలా భయపడ్డాను. నాకంటే ఎక్కువగా నా కుటుంబ సభ్యులు, ముఖ్యంగా నా చెల్లెలు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. నా కుటుంబంలో ఇలాంటివి చూసే అలవాటు ఎవరికీ లేదు. నావల్ల వాళ్లు భయపడటం నన్ను మరింత బాధించింది" అని తెలిపారు.

"ఒక నటిగా నా పని నేను చేస్తున్నాను. నా నటనతో ప్రేక్షకులను సంతోషపెట్టడానికి ప్రయత్నిస్తున్నాను. అయినా నాపై ఎందుకింత ద్వేషం..? నేనేం తప్పు చేశానని నన్ను ఇంతలా టార్గెట్ చేస్తున్నారు..?" అని రష్మిక ప్రశ్నించారు. కెరీర్‌లో అగ్రస్థానంలో కొనసాగుతున్నప్పటికీ, వ్యక్తిగతంగా ఎదుర్కొంటున్న ఈ వేధింపులు తనను మానసికంగా కుంగదీస్తున్నాయని ఆమె వాపోయారు. ప్రస్తుతం రష్మిక వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఆమె ఆవేదనపై పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు మద్దతు తెలుపుతున్నారు.

## జల్సా మరోమారు సెప్టెంబర్ 2న విడుదల

**టాకీస్:** పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా సెప్టెంబర్ 2న ఆయన అభిమానుల కోసం 'జల్సా' సినిమాను మళ్లీ రీ రిలీజ్ చేయబోతున్నారు మేకర్స్. ఈ విషయాన్ని గీతా ఆర్ట్స్ సంస్థ సోషల్ మీడియా వేదికగా అధికారికంగా ప్రకటించింది. గతంలో 2022లో కూడా పవన్ కళ్యాణ్ పుట్టినరోజు




సందర్భంగా 'జల్సా' సినిమాను 4కె వెర్షన్‌లో రీ-రిలీజ్ చేశారు. అయితే అప్పుడే ఈ చిత్రం రూ.3 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టి రీ-రిలీజ్ సినిమాల్లో కొత్త రికార్డులను సృష్టించింది. అయితే ఈ సినిమాను మళ్లీ చూడటానికి అభిమానులు ఆసక్తి చూపుతుండడంతో సెప్టెంబర్ 2న రీ రిలీజ్ చేయబోతున్నారు మేకర్స్.



## నానితో శేఖర్ కమ్ముల మూవీ

### టాలీవుడ్‌లో తాజా చర్చ

టాకీస్: టాలీవుడ్ స్టార్ డైరెక్టర్ శేఖర్ కమ్ముల వైవిధ్యమైన కథలతో ప్రేక్షకులకి మంచి వినోదం పంచుతున్న విషయం తెలిసిందే. ఆయన తెరకెక్కించిన ప్రతి చిత్రం కూడా బాక్సాఫీస్ దగ్గర మంచి వసూళ్లే రాబట్టింది. ఇటీ-వల కుబేర అనే చిత్రంతో పలకరించాడు. ఈ మూవీ కూడా మంచి విజయం సాధించింది. ఇక ఇప్పుడు నానితో ఓ ప్రాజెక్ట్ చేయనున్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి. నేచురల్ స్టార్ నాని తన కెరీర్‌ను వైవిధ్యంగా మలుస్తున్నాడు. ప్రేమకథలతో, కుటుంబ డ్రామాలతో ప్రేక్షకుల మనసు దోచిన నాని, ఇటీవల 'హిట్ 3'లాంటి డార్క్ యాక్షన్ థ్రిల్లర్‌తో వైవిధ్యాన్ని చూపించాడు. ప్రస్తుతం శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో 'ది ప్యారడైజ్' చిత్రం చేస్తున్నాడు. ఈ మూవీ తర్వాత శేఖర్ కమ్ముల దర్శకత్వంలో ఓ మూవీ చేయనున్నాడనే వార్త ఫిల్మ్ సర్కిల్స్‌లో చక్కర్లు కొడుతోంది. ఇటీవలే 'కుబేర' మూవీతో మళ్లీ ఫామ్‌లోకి వచ్చిన శేఖర్ కమ్ముల, నానితో కలిసి ఎలాంటి కథను సినిమాగా తీయబోతున్నారా అనే ఆసక్తి పెరుగుతోంది. వీరిద్దరి కాంబినేషన్‌లో ఇది తొలి సినిమా కావడం, ఇద్దరికీ భిన్నమైన ఫాలోయింగ్ ఉండటంతో ఈ ప్రాజెక్ట్‌పై అప్పడే హైప్ క్రియేట్ అయింది. ఈ మూవీలో హీరోయిన్‌గా సాయిపల్లవి పేరు వినిపిస్తుంది. ఇది నిజమైతే, ఇది నాని - సాయిపల్లవి జోడీకి మూడో సినిమా అవుతుంది. గతంలో వీరిద్దరూ కలిసి నటించిన 'ఎంసీఏ' (2017), 'శ్యామ్ సింగరాయ్' (2021) మంచి విజయం సాధించాయి. ప్రేక్షకుల నుంచి హిట్ పెయిర్‌గా గుర్తింపు కూడా పొందారు. శేఖర్ కమ్ములకు సాయిపల్లవి ఫేవరెట్ హీరోయిన్. ఇద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'ఫిదా' ఆమెకు స్టార్‌డమ్ తీసుకొచ్చింది. ఆ తర్వాత 'లవ్‌స్టోరీ' కూడా మంచి స్పందన తెచ్చుకుంది. తెలంగాణ యాసలో సాయిపల్లవి చెప్పిన డైలాగులు ఇప్పటికీ ప్రేక్షకులను ఆకట్టు-కుంటు-న్నాయి. ఇప్పుడు అదే దర్శకుడు, అదే హీరోయిన్, కొత్తగా నానితో జత కట్టడం విశేషం. సాయిపల్లవి ఇటీవలే నాగచైతన్యతో నటించిన 'తండేల్' సినిమాతో బ్లాక్‌బస్టర్ అందుకుంది. ఇప్పుడు బాలీవుడ్‌లో రూపొందుతున్న భారీ మైథాలజికల్ మూవీ 'రామాయణ' లో సీత పాత్రలో నటిస్తోంది. ఈ చిత్రంలో రణ్‌బీర్ కపూర్ రాముడిగా, యష్ రావణుడిగా నటించగా, 2026 లేదా 2027 దీపావళికి రిలీజ్ చేయాలని మేకర్స్ లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే నాని - శేఖర్ కమ్ముల ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన ఎప్పుడు వస్తుందా అని ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.